


మెగా డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు తమ ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలి. వేలాది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించిన కూటమి ప్రభుత్వ విజయాన్ని జీర్ణించుకోలేక, అర్హత సాధించిన అభ్యర్థుల కష్టం, వారి కుటుంబాల ఆశయాలను అవమానించేలా వైసీపీ విషప్రచారం చేస్తోంది.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


బుధవారం 29.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 98 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# ఎల్‌నినోపై యుద్ధం!

- రైతులకు అండగా నిలవాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- ప్రతి పంటకు బీమా తప్పనిసరి
- తాగునీరు, పశుగ్రాసంపై ప్రత్యేకదృష్టి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఎల్ నినో కష్టకాలంలో రైతులను ఆదుకోవాలని... వారికి సరైన సమాచారాన్ని సహకారాన్ని అందిస్తూ అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు, రైతుల్లో కల్పించాల్సిన అవగాహనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. ఎల్ నినో ప్రభావం ఏ మేరకు ఉంటుంది... దీనికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ వంటి అంశాలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. జూలై నెలలో 69 శాతం లోటు వంపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో సరాసరి 35 నుంచి 40 శాత మేర లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్న అధికారులు... జూన్ -- నవంబర్ మధ్య 844 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 551 మి.మీ మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతోందని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ఉన్న అంచనాల ప్రకారం అన్ని జిల్లాల్లోనూ ఎల్‌నినో ప్రభావం చూపిస్తోందని, ఎక్కువగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయని అధికారులు చెప్పారు. 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07 లక్షల హెక్టార్లలో వరిపై ప్రభావం చూపిస్తుందని అధికారులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పరిధిలోనే వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. వంశధార నుంచి జలాలు అందుబాటులోకి వస్తే వాటిని సద్వినియోగం చేసుకుంటూ పంటలను కాపాడాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో 122 హై రిస్క్ మండలాలను గుర్తించామని అధికారులు సీఎంకు వివరించడంతో... హై రిస్క్ మండలాల్లో బోరు ఆధారంగా పంటలను కాపాడుకునే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఆగస్ట్ 3 నుంచి అవగాహన కార్యక్రమాలు, వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి, అత్యవసర విత్తన ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. 2 లో..



## వేగం.. నాణ్యత.. గడువే ప్రమాణం

- గడువులోగా ప్రతి ప్రాజెక్టు పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశం
- స్పీడ్, క్వాలిటీ, డెలివరీతో రాజధాని నిర్మాణంపై ఫోకస్

2 లో

## అమరావతిలో జెనోమిక్ హబ్

- ఆస్ట్రాజెనెకా ఇండియాతో ఏపీ ప్రభుత్వం ఎంఓయూ
- దేశంలోనే తొలి ప్రెసిషన్ అంకాలజీ విధానానికి శ్రీకారం

2 లో

## భోగాపురం వేడుకలకు ఫుల్ స్పీడ్

- ఆగస్టు 1లోగా ఏర్పాట్లు పూర్తి చేయాలి
- ప్రధాని పర్యటనకు శాఖల సమన్వయం



**భోగాపురం(జర్నలిస్ట్ ఫైల్)** : విజయనగరం జిల్లా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రధాని పర్యటన విజయవంతానికి ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఆగష్టు 1వ తేదీన రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై భోగాపురం విమానాశ్రయంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కే.రామ్మోహన్ నాయుడుతో కలిసి అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారుల పనులు, పార్కింగ్, టెర్మినల్ బిల్డింగ్, బహిరంగ సభ వేదిక, భద్రత, జనసమీకరణ, ప్రోటోకాల్ గ్యాలరీ, భోజనం, రవాణా ఏర్పాట్లపై ఇప్పటివరకు మిగతా 2లో...



## లక్ష్యమే యువతకు దిక్సూచి

- క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చన్న నారా భువనేశ్వరి
- పరీక్షల్లో ఓటమి అంతిమం కాదు...
- ఆత్మహత్యలకు దూరంగా ఉండాలని సూచన

**కుప్పం(జర్నలిస్ట్ ఫైల్)** : విద్యార్థులు ఎంచుకున్న రంగంలో ప్రతిభ కనబరిస్తే అద్భుత విజయాలు సాధించవచ్చని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ప్రతి ఒక్కరినీ మెప్పించాల్సిన అవసరం లేదని, లక్ష్య సాధనలో ముందుకు వెళ్లడంపైనే యువత దృష్టి పెట్టాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా బాగుంటే కుటుంబం సంతోషంగా ఉంటుందని అన్నారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా రెండవరోజు పలు కార్యక్రమాల్లో నారా భువనేశ్వరి పాల్గొన్నారు.

**నిరంతర కృషితోనే విజయం :** కుప్పం పిఇఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులతో నిర్వహించిన క్విజ్ కార్యక్రమంలో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. విద్యార్థుల క్రీడలను వీక్షించారు. అనంతరం క్విజ్ లో విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.... యువత చేతిలోనే మన దేశ భవిష్యత్ ఉంది. ఇక్కడున్న విద్యార్థుల్లో దేశ భవిష్యత్ నాయకులు ఉన్నారు. ఎంతో మంది విద్యార్థులను కలుస్తూ వారి లక్ష్య సాధనకు నా వంతుగా ప్రేరణ కలిగిస్తున్నందుకు సంతోషంగా ఉంది. లక్ష్యంతో ముందుకెళ్తే టీచర్, ఇంజనీర్, డాక్టర్, బిజినెస్ మ్యాన్, పోలీస్, ఐఏఎస్ , ఐపీఎస్ ఏదైనా సాధించవచ్చు. దేశ రక్షణలో మిగతా 2లో...





## బొండా వివరణతో సంతృప్తి

- త్రిసభ్య కమిటీకి వివరణ ఇచ్చిన బొండా ఉమా
- భవిష్యత్తులో జాగ్రత్తగా ఉంటానన్న హామీతో సంతృప్తి చెందిన అధిష్ఠానం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభకు హాజరై.. వైసీపీ నేతలను కలిసిన వ్యవహారంపై టీడీపీ నేత బొండా ఉమామహేశ్వరావు ఇచ్చిన వివరణతో పార్టీ అధిష్ఠానం సంతృప్తి వ్యక్తం చేసింది. మిగతా 2లో...

## మోదీకి మెటా క్షమాపణలు

- ఉద్దేశపూర్వక చర్య కాదని ప్రకటన
- సాంకేతిక సమస్యతో వీడియో తొలగింపునకు వివరణ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : ప్రధాని నరేంద్రమోదీ ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన వీడియోను తొలగించిన వివాదంపై మెటా సంస్థ కేంద్ర ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పింది. మోదీ వీడియోను ఉద్దేశపూర్వకంగా తొలగించలేదని, కేవలం సాంకేతిక కారణాల వల్ల అలా జరిగినట్లు మిగతా 2లో...

## జనసంద్రమైన సింహాచలం..



- అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ
- 32 కిలోమీటర్ల మార్గమంతా జనసంద్రమే
- 10 లక్షల మందికిపైగా భక్తులు పాల్గొంటారని అంచనా

**సింహాచలం(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. -2లో...

## ఏపీ స్మార్ట్ గవర్నెన్స్‌కు ప్రశంసలు




- ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించిన రాజస్థాన్ బృందం
- ఏఐ, డేటాలేక్‌తో ప్రజాసేవల మెరుగుదలపై ఆసక్తి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఐటీ శాఖ ఉన్నతాధికారుల బృందం మంగళవారం సందర్శించింది. రాజస్థాన్ ప్రభుత్వరంగ సంస్థ రాజ్‌కాంప్ ఇన్ఫో సర్వీసెస్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ లక్ష్మీకాంత్ కటార, రాజస్థాన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిపార్టుమెంట్‌కు చెందిన బ్రహ్మగుప్త సెంటర్ ఆఫ్ ఫ్రంటీయర్ టెక్నాలజీస్ సంస్థ నోడల్ ఆఫీసర్ రమేష్ దవాండ, డిప్యూటీ డైరెక్టర్ నితీష్‌కుమార్ జంగడిల నేతృత్వంలో అధికారులతో కూడిన ప్రతినిధుల బృందం ఆర్టీజీఎస్ పనితీరును గురించి తెలుసుకోవడానికి వచ్చారు. ఈ బృందానికి ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ స్వాగతం పలికి ఆర్టీజీఎస్ పనితీరు గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఆర్టీజీఎస్ ద్వారా రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న డేటా డ్రివన్ గవర్నెన్స్ ఆశయాల గురించి, డేటాలేక్, దానిద్వారా ఒనగూరుతున్న ప్రయోజనాల గురించి మిగతా 3లో...

## రూ.2 వేల కోట్ల భూములకు భరోసా



- గాజువాకలో 174.43 ఎకరాల జప్తు ప్రక్రియ నిలిపేందుకు కమిటీ కసరత్తు
- ఆగస్టు తొలి వారంలో బ్యాంకర్లు, ఉన్నతాధికారులతో కీలక సమావేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గంలో దాదాపు రూ.2000 కోట్లు విలువ చేసే 174.43 ఎకరాల భూమిని బ్యాంకుల జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తామని ఉప సభాపతి మరియు అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘు రామకృష్ణ రాజు వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్లో ఆయన అధ్యక్షతన ఫిర్యాదుల కమిటీ సమావేశం జరిగింది. అనంతరం అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప సభాపతి రఘురామ కృష్ణ రాజు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ పరిశ్రమ నెలకొల్పేందుకు 1981లో రాష్ట్ర ప్రభుత్వం 174.43 ఎకరాల భూమిని కేటాయించగా చేయగా ఆ సంస్థ దివాలా తీయడంతో ప్రస్తుతం ఆ భూమి జప్తునకు గురయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఏపి రిఫ్రాక్టరీస్ సంస్థ భూములు మరియు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఆర్-కార్డులు (రీహాబిలిటేషన్ కార్డులు) అంశాలపై అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన ఫిర్యాదుల కమిటీ సమావేశంలో సభ్యులందరితో మిగతా 3లో...

## చైనా 'కృత్రిమ సూర్యుడు' సిద్ధం



- అత్యంత శక్తివంతమైన ఫ్యూజన్ మాగ్నెట్ నిర్మాణం పూర్తి
- అపరిమిత స్వచ్ఛ ఇంధన ఉత్పత్తికి ఆశలు

**బీజింగ్:** పర్యావరణ అనుకూలమైన, అపరిమితమైన శక్తి ఉత్పత్తికి సంబంధించిన శాస్త్రీయ ప్రపంచపు కలలకు మద్దతు ఇచ్చే దిశగా చైనా ఒక కీలకమైన అడుగు వేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద సూపర్ కండక్టింగ్ ఫ్యూజన్ మాగ్నెట్ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. అణు సంలీనం ద్వారా సూర్యుని శక్తికి సమానమైన శక్తిని మిగతా 3లో...

## వేగం.. నాణ్యత.. గడువే ప్రమాణం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో వేగం మరింత పెరగాలని....అనుకున్న సమయానికి ప్రతి ప్రాజెక్టు పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. స్పీడ్, క్వాలిటీ, డెలివరీ లక్ష్యంగా రాజధాని పనులు జరగాలని సీఎం అన్నారు. గతంతో పోల్చితే పనుల్లో వేగం కొంత మేర పెరిగినా... ఇంకా వేగం పెంచాలన్నారు. ఒక నిర్మాణ సంస్థగా రాజధాని పనులు చేపట్టడం గొప్ప అవకాశమని...ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. ఆర్థికంగా ఎటువంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం చూస్తున్న నేపథ్యంలో... పనుల్లో ఎక్కడా జాప్యం ఉండకూడదని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో రాజధాని అమరావతి నిర్మాణ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజధానిలో 95 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 50,999 కోట్ల విలువైన పనులు చేపట్టగా...నెలకు కనీసం 7.92 శాతం పనులు జరగాలని సూచించారు. భూసేకరణ, నిధుల సమీకరణ, అనుమతులు, డిజైన్లు వంటి అంశాల్లో అన్ని శాఖలు, ఉన్నతాధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అమరావతి అంటే... కేవలం 29 గ్రామాల సమాహారంగా కాకుండా విజయవాడ, గుంటూరుతో కలిపి చూడాలన్నారు. అందుకు తగిన విధంగా ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల ప్రాజెక్ట్ పనులు జరగాలన్నారు. రోడ్ల నిర్మాణంతో పాటు పచ్చదనం పెంపుపైనా దృష్టిపెట్టాలని సూచించారు. తాను కూడా స్వయంగా ఇకపై రాజధాని పనులను పరిశీలిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో మంత్రి నారాయణ, సీఎస్ సాయిప్రసాద్, ఉన్నతాధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మోదీకి మెటా క్షమాపణలు

(మొదటి పేజీ తరువాయి)

మెటా స్పష్టత ఇచ్చింది. అంతేకాకుండా ఆ వీడియోను అందరికీ కనిపించేలా పునరుద్ధరించింది.

**ఇంతకీ ఏం జరిగింది? :** నీట్–యూజీ 2026 పరీక్షల అక్రమాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో విద్యార్థులు సుదీర్ఘ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆ నేపథ్యంలోనే జులై 23న ప్రధాని మోదీ మొదటిసారిగా నేరుగా (జెన్–జీ) యువతను ఉద్దేశించి ఫేస్‌బుక్ వేదికగా ప్రసంగించారు. ఆ ఫేస్‌బుక్ వీడియోలో పరీక్ష పేపర్ లీకేజీలకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఇందుకోసం మరింత కఠినమైన చట్టపరమైన నిబంధనలను కేంద్ర మంత్రివర్గం ముందుకు తీసుకువస్తామని చెప్పారు.

“ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నేను సంబంధిత శాఖలను ఆదేశించాను. పేపర్ లీక్ కేసులను విచారణ చేయడానికి కఠినమైన శిక్షలు, ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసేలా రూపొందించిన ముసాయిదా చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు కేబినెట్‌లో చర్చిస్తాం. మన యువత సంక్షేమం, భవిష్యత్తు కంటే మరేదీ ముఖ్యం కాదు” అని మోదీ ఆ వీడియోలో చెప్పారు. దాదాపు 22 లక్షల మంది విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

అయితే ఫేస్‌బుక్ జులై 28 తెల్లవారుజామున ఈ వీడియో యాక్సెస్‌ను కొద్దిసేపు నిలిపివేసింది. దీనితో మోదీ పెట్టిన వీడియో పోస్టు కనిపించకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం ఈ చర్యను తీవ్రంగా పరిగణించింది. ప్రధాని మోదీ పోస్టు ఎందుకు తొలగించారో చెప్పాలంటూ, మెటా గ్లోబల్ పబ్లిక్ పాలసీ హెడ్‌కు ఐటీ మంత్రిత్వశాఖ సమన్లు జారీ చేసింది. దీనితో దిగి వచ్చిన మెటా కేంద్ర ప్రభుత్వానికి క్షమాపణ చెప్పింది. “ప్రధాని నరేంద్ర మోదీ వీడియోను పొరపాటున తొలగించడం జరిగింది. ప్రస్తుతం దీనిని తిరిగి పునరుద్ధరించాం” అని మెటా ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## బొండా వివరణతో సంతృప్తి

(మొదటి పేజీ తరువాయి)

ఈ అంశంపై పార్టీ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ముందు బొండా ఉమా హాజరై తన వివరణను అందించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు పల్లా శ్రీనివాస్, మంత్రి నిమ్మల రామానాయుడు బొండా ఉమాకు పలు సూచనలు చేసినట్లు సమాచారం. పార్టీలో అంతర్గతంగా చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందని వారు ప్రశ్నించారు. కాపు సామాజిక వర్గానికి టీడీపీ చేసిన మేలు, ప్రత్యర్థి పార్టీ చేసిన ద్రోహం గురించి మీకు బాగా తెలుసు కదా? అని మంత్రి నిమ్మల.. బొండా ఉమాతో వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. అయితే ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభకు హాజరైన విషయాన్ని మాత్రం తాము తప్పుబట్టడం లేదని పల్లా శ్రీనివాస్, నిమ్మల రామానాయుడు స్పష్టం చేసినట్లు తెలిసింది.

అయితే సభ అనంతరం బొండా ఉమా చేసిన వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగించేలా ఉన్నందునే వివరణ కోరాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని తీవ్రంగా విమర్శించిన వ్యక్తులతో సఖ్యతగా కనిపించడం పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోయాయని వారు అభిప్రాయపడ్డారు. అలాగే తమ వ్యాఖ్యలను వక్రీకరించే అవకాశం ఉన్న మీడియా సంస్థలకు ఎందుకు ఇంటర్వ్యూలు ఇచ్చారని కూడా బొండా ఉమాను ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై స్పందించిన బోండా ఉమా.. సమన్వయ లోపం కారణంగానే కొన్ని పరిణామాలు చోటుచేసుకున్నాయని వివరణ ఇచ్చారు. తాను ఎప్పుడూ పార్టీ అధిష్టానానికి వ్యతిరేకంగా వ్యవహరించే వ్యక్తిని కాదని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. బొండా ఉమ వివరణతో సంతృప్తి చెందిన పార్టీ అధిష్టానం ఈ వ్యవహారాన్ని ఇక్కడితో ముగించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## దాతల సాయన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎంఈవో కెన్నెడీ



కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకొని ప్రయోజకులై వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ఆనందాన్ని కలిగించాలని కాకుమాను మండల విద్యాశాఖ అధికారి కే. ఎఫ్ .కెన్నెడీ విద్యార్థులకు ఉపదేశించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ కొమ్మూరు లో ప్రధానోపాధ్యాయులు గా పనిచేయుచున్న బీ. హనుమంత ప్రసాద్ తల్లి బొద్దుకూరి రాజమ్మ జ్ఞాపకార్థం వారి మనవరాళు ృ ఫణి కృష్ణ ప్రసన్న , కుమారి బి. జాహ్నవి పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఇంగ్లీష్, తెలుగు వర్క్ పుస్తకాలు పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి హనుమంత ప్రసాద్, ఉపాధ్యాయిని మెరిగల శ్యాంకుమారి ,సి. ఆర్.ఎం.టి బి సురేంద్ర పాల్గొన్నారు.

# ఎల్‌నినోపై యుద్ధం!



(మొదటి పేజీ తరువాయి)

కంది, ఆముదం, మినుము పంటలను ఇప్పటికే కొందరు ప్రత్యామ్నాయ పంటలుగా వేస్తున్నారని చెప్పారు. ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద ఈ నెల 31వ తేదీ వరకు నమోదు ప్రక్రియ కొనసాగిస్తున్నామని... అయితే వరి పంటకు ఆగస్ట్ 15 వరకు సమయం ఉందని అధికారులు వివరించారు. ఇప్పటి వరకు 6.30 లక్షల హెక్టార్ల మేర పంటలను బీమాలో నమోదు చేశామని అధికారులు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ... వేసిన ప్రతి పంటకు బీమా నమోదు చేయాల్సిందేనని... ఏ పంటకైనా బీమా నమోదు చేయకపోతే... దానికి కలెక్టర్లే బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. అలాగే తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పశుగ్రాసానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు వివరించారు. 5 నెలలకు సరిపడా 286.30 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందుబాటులో ఉంచామని అధికారులు చెప్పారు. అయితే 5 నెలలకు సరిపడా పశుగ్రాసం సిద్ధం చేసుకుంటే సరిపోదని... ఎల్ నినో ప్రభావం ఏడాది పొడవునా కన్పించే సూచనలు ఉండడంతో ఏడాదికి అవసరమైన పశుగ్రాసాన్ని అందుబాటులో ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

**ఎల్ నినోపై ప్రతివారం నివేదికలు:** ఈ సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...”ఎల్ నినో ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలి. వరదలు, తుఫాన్లు వచ్చినప్పుడు ఎలా మానిటర్ చేశారో... అదే విధంగా ఎల్ నినో అంశాన్ని మానిటర్ చేయాలి. పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలి... వచ్చిన డేటాను విశ్లేషించాలి.. విశ్లేషించిన డేటా ఆధారంగా సూచనలివ్వాలి.. వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసేలా రైతు సేవా కేంద్రాల సిబ్బందిని అప్రమత్తం చేయాలి. ఏయే ల్యాండ్ పార్శిళ్లలోని పంటలకు ఇబ్బందులో గమనించాలి. అక్కడ బోర్లు ఏమైనా అందుబాటులో ఉన్నాయా..? అనే సమాచారంతో రైతులకు సరైన గైడెన్స్ ఇచ్చేలా వ్యవస్థలను ఉపయోగించుకోవాలి. అలాగే సదురు ప్రాంతంలో భూగర్భ జలాల పరిస్థితిని కూడా తెలుసుకోవాలి. ఈ సమాచారానికి అనుగుణంగా రైతు సేవా కేంద్రాల ద్వారా ఆ ల్యాండ్ పార్శిళ్లకు చెందిన రైతులకు సరైన గైడెన్స్ ఇచ్చేలా అధికారులు కృషి చేయాలి. ఎల్ నినో ప్రభావం ఏ స్థాయిలో ఉండబోతోందనేది రైతులకు ముందుగానే చెప్పాలి. రైతులకు సరైన సమాచారం అందించగలిగితే... పెట్టుబడి వృథా కాదు”అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఎల్ నినో ఉపద్రవాన్ని అధిగమించడం ఓ సవాల్ :** “ఇక పశుగ్రాసం విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకూడదు. పశువులకు దాణా కొరత ఉండకూడదు. పాల ఉత్పత్తి ఎంత మాత్రమూ తగ్గడానికి వీల్లేదు. ఈ మేరకు వీబీజీ రామ్ జీ పథకాన్ని ఎల్ నినోలో పూర్తిగా వినియోగించుకోవాలి. అలాగే ఉద్యాన పంటలకు జీ రామ్ జీ నిధులను వాడుకోవచ్చు. ఎల్ నినో ఉపద్రవాన్ని అధికార యంత్రాంగం ఓ సవాల్ గా తీసుకుని పని చేయాలి. మార్కెట్ కమిటీలు, నీటి సంఘాల సభ్యులను ఎల్ నినో అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలి. పరిస్థితులను అంచనా వేసేందుకు... రైతులకు సూచనలు చేసేందుకు.. అలాగే వాతావరణ పరిస్థితులను.. పంటలను అధ్యయనం చేసేందుకు వ్యవసాయ యూనివర్శిటీ విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలి. ఈ మేరకు ఆర్ఎస్కే సిబ్బందిని కన్వీనర్లుగా నియమించుకుని కార్యాచరణ అమలు కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి. మంత్రి మొదలుకుని అధికార యంత్రాంగం మొత్తం క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేస్తూ ఉండాలి. ఎల్ నినో వంటి ఉత్పాతాలు సంభవించిన సందర్భాల్లో డెయిరీ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. ఎల్ నినో యాక్షన్ ప్లాన్ అమలు చేసే విషయంలో శాఖల మధ్య సమన్వయం తప్పకూడదు. కూరగాయల ధరలు సహా నిత్యావసరాలు ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి.

మొబైల్ రైతు బజార్లను జిల్లాకొకటి చొప్పున ఏర్పాటు చేయాలి. వీటిని రైతులు లేదా డ్వాక్రా మహిళలకు అందించాలి”అని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షకు మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరయ్యారు.

# అమరావతిలో జెనోమిక్ హబ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కాన్సర్ రంగంలో జన్యుపరమైన పరిశోధనల ద్వారా వైద్య చికిత్సలను అందించేందుకు వీలుగా కీలకమైన ముందడుగు పడింది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానాన్ని ప్రారంభించేందుకు వీలుగా అంతర్జాతీయ ఫార్మాసుటికల్, బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ ఆస్ట్రాజెనెకా ఇండియా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్స్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో వైద్యారోగ్యశాఖ- ఆస్ట్రాజెనెకా ఇండియా సంస్థల ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. రిలయన్స్‌కు చెందిన స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూఆర్ఏఐ సంస్థలతో కలిసి ఆస్ట్రా జెనెకా ఇండియా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించేందుకు ఈ ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఊపిరితిత్తులు, రొమ్ము కాన్సర్ రోగుల కోసం అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ చేసేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్ సెంటర్‌ను ఆస్ట్రా జెనెకా ఏర్పాటు చేయనుంది. అమరావతి క్వాంటం వ్యాలీ- ఆస్ట్రా జెనెకా ఇండియా భాగస్వామ్యంతో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించనున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, నెక్ట్స్ జనరేషన్ సీక్వెన్సింగ్ , ఆధునిక జన్యుచికిత్సా విధానాల్ని వినియోగించి కాన్సర్ ప్రారంభదశలోనే గుర్తించి శరీర తత్వానికి అనుగుణంగా చికిత్స అందించేలా ఈ ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానం ఉపకరించనుంది. ఊపిరితిత్తుల కాన్సర్‌ను ముందుగా గుర్తించేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తో కూడిన ఎక్స్ రే ఆధారిత వ్యవస్థను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయనుంది. తద్వారా రోగులను వేగంగా స్క్రీనింగ్, డయాగ్నోస్టిక్ సేవలు అందటం తో పాటు ఎలాంటి జాప్యం లేకుండా చికిత్స చేసేందుకు వీలుగా మార్గం సుగమం కానుంది.

**వైద్య రంగంలో పరిశోధనలకు క్వాంటంవ్యాలీ సేవలు :** ప్రజలందరికీ అందుబాటులో అత్యాధునిక వైద్య సదుపాయాలను తీసుకురావటమే ఈ ఒప్పందం లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఫార్మా, బయో టెక్నాలజీ రంగాల్లో క్వాంటం పరిశోధనలు జరగాల్సి ఉందని సీఎం సూచించారు. కాలుష్యం లాంటి బాహ్య కారణాల వల్ల కూడా ప్రమాదకరమైన కాన్సర్ బారిన పడుతున్నారని... ముందే గుర్తించి చికిత్సలు అందించటం ద్వారా రోగులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. వైద్య రంగంలోని వ్యవస్థలు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో పనిచేయాలని సీఎం సూచించారు. ఏపీలో సంజీవని ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని ప్రతీ పౌరుడి హెల్త్ ప్రొఫైల్ ను డిజిటల్ రికార్డులుగా మారుస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. వైద్యారోగ్య రంగంలో మరింత వేగంగా ట్రాన్స్‌ఫర్మేషన్ జరగాల్సి ఉందని తెలిపారు. కేన్సర్ తో పాటు ఇతర వ్యాధులపై కూడా అమరావతి క్వాంటం వ్యాలీ నుంచి విస్తృతంగా పరిశోధనలు జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ జి.సాయి ప్రసాద్, ఆస్ట్రాజెనెకా ఇండియా ఎండీ ఏ. ప్రవీణ్ రావు , స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థల ప్రతినిధులు, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## భోగాపురం వేడుకలకు ఫుల్ స్పీడ్



(మొదటి పేజీ తరువాయి)

చేపట్టిన చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి నారా లోకేష్ పలు సూచనలు చేశారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి 32 నియోజకవర్గాల నుంచి దాదాపు 3 లక్షల మంది హాజరవుతారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. బహిరంగ సభ వేదికలో వీవీఐపీ సీటింగ్ సామర్థ్యాన్ని 520 నుంచి వెయ్యికి పెంచామని, వీఐపీ 3వేలు, వెయ్యి మంది ఛాంపియన్స్, విమానాశ్రయానికి భూములు ఇచ్చిన వారు ఆసీనులయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజల కోసం ప్రధాన రహదారికి ఇరువైపులా 20 భోజనం కౌంటర్లు ఏర్పాటుచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని మంత్రి లోకేష్ సూచించారు. విద్యార్థుల విషయంలో అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అంబులెన్స్ లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కే. అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, కొలుసు పార్థసారథి, బీసీ జనార్థన్ రెడ్డి, డోలా బాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, కళా వెంకట్రావు, ఏలూరి సాంబశివరావు, పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, అరిమిల్లి రాధాకృష్ణ, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిలారు రాజేష్, కార్యక్రమాల కమిటీ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర యాదవ్, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, విజయనగరం డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే ఎస్.వీ.ఎస్.ఎన్ వర్మ, జీఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ ఛైర్మన్ జీబీఎస్ రాజు, స్టేట్ మీడియా కోఆర్డినేటర్ బీవీ. రాముడు, ప్రధాని పర్యటన నోడల్ అధికారి ఎంటీ కృష్ణబాబుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ‘వీబీ జీ రామ్ జీ’తో ఎల్ నినో కరువుకు చెక్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : కరోనా కంటే ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్న ఎల్ నినో వర్షాభావ పరిస్థితులను ‘వీబీ జీ రామ్ జీ’ పథకం ద్వారా సమర్థంగా ఎదుర్కొంటామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. పెనుకొండలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాబోయే నాలుగు నెలలు అత్యంత కీలకమని, గ్రామాల్లో ఎల్ నినోపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే చిరుధాన్యాల వైపు రైతులు మళ్లాలని, పొలం కుంటల నిర్మాణానికి 50 శాతం రాయితీ అందిస్తున్నామని, నీరు లేని చెరువుల్లో పశుగ్రాసం పెంచాలని అధికారులను ఆదేశించారు. వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పనతో పాటు గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, వలసల నివారణకు అవకాశం ఉంటుందని, జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ. 11.50 కోట్లతో తాగునీటి సదుపాయాలు కల్పించాలని సూచించారు.

# జనసంద్రమైన సింహాచలం..

(మొదటి పేజీ తరువాయి)

సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో 32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడుతోంది.

కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది 10 లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

పాదయాత్ర చేస్తున్న భక్తుల కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో 33 చోట్ల వైద్య శిబిరాలు, 26 అంబులెన్స్‌లను అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న వారికి అప్పన్న ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు.



మార్గమధ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు.

32 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని భక్తులు బుధవారం ఉదయానికి స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. ఆషాఢ పౌర్ణమి నాడు సింహాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

# లక్ష్యమే యువతకు దిక్సూచి

(మొదటి పేజీ తరువాయి)

పోలీసుల సేవలు అమూల్యమైనవి. తెల్లవారుజామున లేవడం, పనిలో తల్లిదండ్రులకు సాయం చేయడం వంటివి విద్యార్థులు అలవాటుగా మార్చుకోవాలి. తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు. వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేము. గురువులు మార్గదర్శకులు. వారిని గౌరవించాలి. కొన్నిసార్లు ఉపాధ్యాయులు కఠినంగా వ్యవహరించినా అది క్రమశిక్షణ కోసమేనని విద్యార్థులు గ్రహించాలి. క్రమశిక్షణతో జీవిస్తే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చు. నేను చెన్నైలోని చర్చ్ పార్క్ ప్రెజెంటేషన్ కాన్వెంట్ లో చదివాను. విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ అలవరుచుకోవడం వల్లే ఎంచుకున్న రంగంలో విజయాలు సాధించాను. ప్రతి ఒక్కరినీ మెప్పించాల్సిన అవసరం లేదు. లక్ష్య సాధనలో ముందుకు వెళ్లడంపైనే దృష్టి పెట్టాలి. అందివచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి. వివేకవంతమైన ఆలోచనతో నిర్ణయాలు తీసుకోవాలి. కుటుంబం ఇబ్బందుల్లో ఉంటే తల్లిదండ్రులకు పిల్లలు అండగా నిలవాలని నారా భువనేశ్వరి సూచించారు.


**విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి:** నాకు ఎదురైన ఇబ్బందులనే అవకాశాలుగా మార్చుకుని ఎదిగాను. క్లాస్ రూం మొదలు వ్యాపారం వరకూ ఎక్కడైనా సరే...సందేహాలు వస్తే భయపడకుండా అడిగి తెలుసుకోవాలి. హెరిటేజ్ సంస్థ నిర్వహణలో నాకు వచ్చే సందేహాలను అడిగేందుకు వెనకాడను. తప్పు చేయడం సహజం. దాన్ని సరిదిద్దుకుని మరోసారి జరగకుండా చూసుకోవాలి. మంచి వ్యక్తులతో స్నేహం మన ఉన్నతికి దోహదపడుతుంది. పుస్తకాలు చదవడం అలవాటుగా చేసుకోవాలి. మొబైల్, ట్యాబ్ లను



అవసరమైనంత వరకే ఉపయోగించాలి. నా మనుమడు దేవాన్ష్ పుస్తకాలు బాగా చదువతాడు. టీవీ, మొబైల్ కి దూరంగా ఉంటాడు. నిజాయితీగా ఉండాలి. తప్పు అనిపిస్తే ధైర్యంగా చెప్పగలగాలి. మాతృభూమికి సేవ చేయడం మన బాధ్యత. అలాగే సమాజానికి సేవ చేసేందుకు మనమంతా ముందుండాలి. వృద్ధులకు సాయం చేస్తూ అండగా నిలబడాలి. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు అత్యుత్తమ విద్య అందిస్తున్నాయి. విద్యార్థుల చదువుకు చేయూత అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు...తల్లికి వందనం కింద రూ. 15,000 ఆర్థిక సాయం అందిస్తున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషితో ప్రైవేటు నుంచి 1.06 లక్షలమంది విద్యార్థులు మళ్లీ ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి. ముఖ్యంగా బాలికలు విజ్ఞానం పెంపొందించుకోవడానికి టెక్నాలజీని వినియోగించుకోవాలి. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి. డ్రగ్స్ తో జీవితాలు నాశనమవుతాయి. ఈ వ్యసనం నుంచి బయటపడటం చాలా కష్టం. పరీక్షల్లో విఫలమవడం జీవితానికి ముగింపు కాదు. ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దు. అలాంటి చర్యలతో తల్లిదండ్రులు కుంగిపోతారు. యుక్త వయసులో ఆడపిల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను నా తల్లి ఎప్పుడూ చెప్పేవారు. జాతిపిత మహాత్మాగాంధీ, ప్రధాని నరేంద్రమోదీ వంటి వారి నుంచి స్ఫూర్తి పొందాలి. మహాత్మునిలా సమాజానికి సేవ చేసే గుణం అలవరుచుకోవాలి. విద్యార్థులంతా బాగా చదువుకుని భవిష్యత్ లో ఉన్నతస్థానాలకు చురుకోవాలని, మన దేశాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానానికి తీసుకెళ్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని నారా భువనేశ్వరి తెలిపారు.

**కుప్పం ప్రజలే మా కుటుంబం :** గుడుపల్లి మండలం, అగరం గ్రామంలో మహిళలతో నారా భువనేశ్వరి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కుప్పం ప్రజలే మా కుటుంబం. ఇక్కడి ప్రజలు మాపై చూపిస్తున్న అభిమానాన్ని ఎప్పటికీ మర్చిపోలేము. గత ప్రభుత్వంలో ప్రజలు ధైర్యంగా మాట్లాడిన పరిస్థితులు లేవు. టీడీపీ కార్యకర్తలపై కేసులు పెట్టినా భయపడలేదు. పార్టీ జెండా వదల్లేదు. రాష్ట్రాన్ని బాగు చేయడం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడ్డాయి. సుపరిపాలన అందిస్తారనే నమ్మకంతో ప్రజలు కూటమిని గెలిపించారు. ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం సీఎం చంద్రబాబు డ్వాక్రా వ్యవస్థను తీసుకొచ్చారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమైతే కుటుంబానికి అండగా ఉండొచ్చు. పేదల కుటుంబాలను ఆదుకునేందుకే పీ4 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి తీసుకొచ్చారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టే సూపర్ సిక్స్ విజయవంతంగా అమలు చేస్తున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రైవేట్ స్కూళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం గొప్ప విషయమని నారా భువనేశ్వరి అన్నారు.

## ఏపీ స్మార్ట్ గవర్నెన్స్‌కు ప్రశంసలు



(మొదటి పేజీ తరువాయి)

పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వంలోని 40 శాఖాల్లోని ఒకచోటకు తీసుకొచ్చి అతిపెద్ద డేటాలేక్ ను రూపొందించామన్నారు. కృత్రిమ మేథ ద్వారా ఈ డేటా ఆధారంగా పాలన మరింత సరళతరం చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందేలా పలు రకాల యూస్ కేసెస్ రూపొందించామని తెలిపారు. ఆర్టీజిఎస్ సీసీటీవీ360 ద్వారా శాంతిభద్రతలను పర్యవేక్షణలో పోలీసులకు ఆర్టీజిఎస్ సాంకేతిక సహకారాన్ని అందిస్తోందన్నారు. అవేర్ విభాగం ద్వారా వాతావరణ మార్పులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ప్రకృతి విపత్తులను ముందుగానే పసిగట్టి ప్రాణ నష్టం, ఆస్తినష్టం వాటిల్లకుండా ముందస్తుగానే ఆయా ప్రాంతంలోని ప్రభుత్వ యంత్రాంగాన్ని, పౌరులను ముందస్తుగానే అప్రమత్తం చేసేలా ఈ వ్యవస్థ పనిచేస్తోందన్నారు. కేవలం వాతావరణం గురించి మాత్రమే కాకుండా, ఇప్పుడు ఈ విభాగం ద్వారా రైతులకు ఆగ్రో అడ్వైజరీ కూడా ఇస్తున్నామని, రాష్ట్రంలోని అన్ని జలాశయాల్లో నీటి నిల్వ పరిస్థితులను, ఆయా ప్రాంతాల్లో కురిసే వర్షాలు, నీటి లభ్యతలను రియల్ టైమ్ లో పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీజీఎస్ పనితీరు అద్భుతంగా ఉందని, ఇతర రాష్ట్రాలకు ఈ వ్యవస్థ ఆదర్శప్రాయంగా ఉందని రాజస్థాన్ ప్రభుత్వ అధికారులు కొనియాడారు. ఈ సమావేశంలో ఆర్టీజీఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి. శ్రీఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.2 వేల కోట్ల భూములకు భరోసా



(మొదటి పేజీ తరువాయి)

కలిసి చర్చించామని పేర్కొన్నారు. దీనిపై ఆగస్టు మొదటి వారంలో ఉన్నతాధికారులు, బ్యాంకర్లతో మరోసారి ఫిర్యాదుల కమిటీ సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామనన్నారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, గురజాల జగన్ మోహన్, విష్ణు కుమార్ రాజు తో కలిసి అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో మీడియా నిర్వహించారు.

ఈమీడియా సమావేశంలో అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ దివాలా తీయడంతో జాతీయ రహదారి-16 కి ఆనుకుని ఉన్న విలువైన భూములు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం ఇచ్చిన భూమిని జప్తు చేసుకునేందుకు చేపడుతున్న ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నామన్నారు. అదే విధంగా స్టీల్ ప్లాంట్ కు భూములిచ్చిన వారి పునరావాసం కోసం ఇచ్చిన ఆర్-కార్డులకు సంబంధించి 1203 మందికి రెగ్యులరైజేషన్ పెండింగ్ లో ఉంచారని వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నామని శ్రీనివాసరావు చెప్పారు.

ఇంకా ఈసమావేశంలో కమిటీ సభ్యులు మరియు శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, గురజాల జగన్ మోహన్, విష్ణు కుమార్ రాజు పాల్గొన్నారు.

## అమృతలూరు ఎంపీడీవో శేషమాంబకు ఘన వీడ్కోలు



- **ముఖ్య అతిథిగా హాజరైన వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు**

**అమృతలూరు (జర్నలిస్ట్ ఫైల్):** అమృతలూరు మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) మారుతి శేషమాంబ ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు శాలువాతో సత్కరించి, ప్రభుత్వ సేవలో ఆమె అందించిన విశిష్ట సేవలను అభినందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ ప్రజాసేవనే ధ్యేయంగా తీసుకుని నిబద్ధతతో విధులు నిర్వహించిన శేషమాంబ ఆదర్శప్రాయ అధికారిణిగా గుర్తింపు పొందారని కొనియాడారు. అమృతలూరు మండల అభివృద్ధికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొని శేషమాంబకు శుభాకాంక్షలు తెలిపారు.

## బి. మఠంలో ఎరువుల దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారుల మెరుపు దాడి

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారి మఠం నందు గల బద్వేల్ రోడ్డులో గల కక్కయ్య స్వామి మఠం సమీపంలో లేపాక్షి ట్రేడర్స్ టైల్స్ అండ్ శానిటరీ అనే పేరుగల గోడౌన్ నందు అక్రమంగా నిలువ ఉంచిన ఎరువుల బస్తాలు నిలువ చేసారు. సమీపంలో స్థానికులని విచారించిగా ఈ గోడౌన్ వెంకటేశ్వర ఫెర్టిలైజర్ యజమాని పి వెంకట కృష్ణారెడ్డిది అని తెలిపారు. సదరు శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ తెలుగు గంగ రోడ్డులోని ఒక కాంప్లెక్స్ లో వ్యాపారం నిర్వహిస్తున్నారు వారిని పిలిచి విచారించగా ఈ గౌరవం నా ఆధీనంలో ఉంది మరియు గోడౌన్ లో ఉన్న ఎరువులు మొత్తము శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ ఎరువులు దుకాణం ద్వారా కొనుగోలు చేసి నిలువ ఉంచారని తెలియజేశారు సదరు గోడౌన్ మండల వ్యవసాయ అధికారి అయిన కే ప్రవీణ్ మరియు పంచాయతీ దారుల సమక్షంలో పంచనామా చేసి అనుమతి లేకుండా అక్రమంగా నిలువ ఉంచిన ఎరువుల గోడౌన్ ని ఎఫ్. సి ఒ యాక్ట్ 1985 ప్రకారం 6(ఎ) సెక్షన్ ప్రకారం చట్ట విరుద్ధమని సీజ్ చేసారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ జెడిఎ వెంకటేశ్వరరావు ఫెర్టిలైజర్స్ ఏవో సుమంత్ రెడ్డి మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రవీణ్ పాల్గొన్నారు

## భావి వైద్యుల్లో ప్రతిభా వికాసానికి డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మరో వినూత్న అడుగు

- **తొలిసారిగా 'ఇంటర్ కాలేజియేట్ కల్చరల్ మీట్-2026' కర్టెన్ రైజర్**
- **ఆగస్టు 12-14 వరకు ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో రాష్ట్రస్థాయి సాంస్కృతిక మహోత్సవం**
- **విద్యతో పాటు సృజనాత్మకత, నాయకత్వం, వ్యక్తిత్వ వికాసానికి సమాన ప్రాధాన్యత - ఉపకులపతి డా. పి. చంద్రశేఖర్**



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : విద్యార్థుల సమగ్రాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం (డా. ఎన్టీఆర్ యూహెచ్ఎస్), విజయవాడ తొలిసారిగా నిర్వహిస్తున్న లిలి'ఇంటర్ కాలేజియేట్ కల్చరల్ మీట్--2026'లిలి కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి డా. పి. చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్ మంగళవారం విశ్వ విద్యాలయంలో సంయుక్తంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఉపకులపతి డా. పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విద్యా ప్రమాణాల పెంపుతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న కళా ప్రతిభ, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి విశ్వవిద్యాలయం సమాన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనుబంధ మెడికల్, డెంటల్ కళాశాలల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవడానికి, పరస్పరం అనుభవాలను పంచుకోవడానికి, ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని పెంపొందించుకోవడానికి ఈ ఇంటర్ కాలేజియేట్ కల్చరల్ మీట్-2026 ఉత్తమ వేదికగా నిలుస్తుందన్నారు. తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ సాంస్కృతిక మహోత్సవం భావి వైద్యుల్లో ప్రతిభను వెలికితీయడమే కాకుండా సృజనాత్మకత, స్నేహభావం, ఐక్యత, సాంస్కృతిక విలువలను మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమం విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మక వార్షిక వేడుకగా రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు.

రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సంభాషణా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన మరింత పెరుగుతాయని తెలిపారు. వైద్య విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికీ విశ్వవిద్యాలయం సమాన ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు.

**ఆగస్టు 12--14 వరకు ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో నిర్వహణ :** ఇంటర్ కాలేజియేట్ కల్చరల్ మీట్--2026 ను ఆగస్టు 12 నుంచి 14 వరకు గుంటూరు జిల్లా చినకాకానిలోని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ రాష్ట్రస్థాయి సాంస్కృతిక వేడుకల్లో సింగింగ్, క్లాసికల్ డ్యాన్స్, గ్రూప్ డ్యాన్స్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, మోనో యాక్టింగ్, క్విజ్, యోగాసనాలు తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

కార్యక్రమంలో ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మరియు డైరెక్టర్ (రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) డా. సూర్యప్రభ, డైరెక్టర్ (పబ్లికేషన్స్) డా. కె. సుధ, విశ్వవిద్యాలయ అధికారులు, సిబ్బంది, ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# చైనా 'కృత్రిమ సూర్యుడు' సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)





ఉత్పత్తి చేయాలనే లక్ష్యం దిశగా మార్గం సుగమం అవుతోంది.

2030 నాటికి ఫ్యూజన్ శక్తి ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేయాలన్న చైనా కలల ప్రణాళికలో ఇదొక ప్రధాన మైలురాయి. ఈ ఫ్యూజన్ అయస్కాంతాన్ని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా ఫిజిక్స్ నిర్మించింది. ఇది 21 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు, 582 టన్నుల బరువు కలిగిన 'D' ఆకారంలో వుండే భారీ అయస్కాంతం. ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్యూజన్ ప్రాజెక్ట్ అయిన 'ITER-R' కోసం అభివృద్ధి చేసిన ఇలాంటి అయస్కాంతాల కంటే ఇది 1.3 రెట్లు పెద్దది. మూడు రెట్లు ఎక్కువ శక్తి నిల్వ సామర్థ్యం దీనికి ఉంది.

**ఫ్యూజన్ రియాక్టర్ సవాలు:** చైనా కలల రియాక్టర్లు, సూర్యుని నుండి శక్తిని ఉత్పత్తి చేసే అదే ఫ్యూజన్ ప్రక్రియను ఉపయోగించుకుంటాయి. 100 మిలియన్ డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతల వద్ద హైడ్రోజన్ అణువులను కలపడం జరుగుతుంది. దీనివల్ల కార్బన్ ఉద్గారాలు లేకుండా భారీ మొత్తంలో శక్తి ఉత్పత్తి అవుతుంది.

ప్రపంచం ఇక ఎక్కువ కాలం వేచి ఉండాల్సిన అవసరం లేదని ఆ ప్రకటన తెలిపింది. ప్రపంచంలోనే మొట్టమొదటి వాణిజ్య ఫ్యూజన్ విద్యుత్ కేంద్రమైన 'చైనా ఫ్యూజన్ ఇంజనీరింగ్ డెమాన్‌స్ట్రేషన్ రియాక్టర్' నాలుగు సంవత్సరాలలో పూర్తి కానుంది. అంతకుముందు, చైనా 'ఈస్ట్' రియాక్టర్ 1,066 సెకన్ల పాటు ప్లాస్మాను 100 మిలియన్ డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద నిలబెట్టి ప్రపంచ రికార్డు సృష్టించింది. తదుపరి దశ రియాక్టర్ నిర్మాణాన్ని 2027 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక.

కొత్త అయస్కాంతం పని, 100 మిలియన్ డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు కలిగిన అత్యధిక వేడి వాయువైన 'ప్లాస్మా'ను రియాక్టర్ గోడలను తాకకుండా బలమైన అయస్కాంత క్షేత్రంలో ఉంచడం. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ విడుదల చేసిన సమాచారం ప్రకారం, ఇది దానిని నిలబెట్టడమే కాకుండా, ఒక స్విచ్ లాగా దాని పనితీరును కూడా నియంత్రించగలదు.

ఫ్యూజన్ రియాక్టర్‌లో గుండెకాయ అధిక-ఉష్ణోగ్రత సూపర్ కండక్టింగ్ సెంట్రల్ సోలెనాయిడ్ కాయిల్. ఇది ఒక కీలకమైన భాగం. కారులోని స్పార్క్ ప్లగ్ లాగా, ఇది ఫ్యూజన్ చర్యను ప్రారంభించడానికి, కొనసాగించడానికి సహాయపడుతుంది.

ఇది మైనస్ 269°C వరకు ఉష్ణోగ్రతల వద్ద 60 సంవత్సరాల పాటు నిరంతరాయంగా పనిచేయగలదు. అంతేకాకుండా, ఇది శక్తి నష్టం లేకుండా 100,000 ఆంపియర్‌ల కంటే ఎక్కువ కరెంట్‌ను ప్రసరింపజేయగలదని, తద్వారా విద్యుత్ నిరోధకతను దాదాపు సున్నాకు తగ్గించగలదని కూడా శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు.

ఇది పూర్తిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తుంది. దీనిని చైనాలో, ఆ దేశపు ముడి పదార్థాలు మరియు తయారీ సామర్థ్యాన్ని ఉపయోగించి తయారు చేస్తారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 47 పేటెంట్లు మరియు 25 పరిశ్రమ ప్రమాణాలను పొందింది.

## గిరి ప్రదక్షిణలో భక్తి-సేవల సమ్మేళనం



- **శ్రీ వరలక్ష్మీ నరసింహ స్వామి గిరి ప్రదక్షిణలో భక్తులకు అల్పాహారం పంపిణీ చేసిన ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

సింహాచలం(జర్నలిస్ట్ ఫైల్) : శ్రీ శ్రీ శ్రీ వరలక్ష్మీ నరసింహ స్వామివారి పవిత్ర గిరి ప్రదక్షిణ సందర్భంగా ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ భక్తులకు అల్పాహారం పంపిణీ చేసి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు స్వయంగా అల్పాహారం అందిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, శ్రీ వరలక్ష్మీ నరసింహ స్వామివారి గిరి ప్రదక్షిణ అనేది భక్తి, విశ్వాసం, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక అని అన్నారు. ఇలాంటి మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులకు సేవ చేసే అవకాశం దక్కడం తమ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

"మానవ సేవే మాధవ సేవ" అనే భారతీయ సంస్కృతి స్ఫూర్తితో బీజేపీ కార్యకర్తలు ఎల్లప్పుడూ సమాజ సేవలో ముందుంటారని చెప్పారు. భక్తులకు అవసరమైన తాగునీరు, అల్పాహారం, ఇతర మౌలిక సదుపాయాలు అందేలా సేవా కార్యక్రమాలు నిర్వహించడం సామాజిక బాధ్యత అని అన్నారు.

శ్రీ వరలక్ష్మీ నరసింహ స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

ఈ సేవా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు.

## "దిక్కు తోసనిస్థితిలో రైతన్నలు "



- **'నీరు లేక ఎండిపోతున్న వరి పైరు'**
- **ప్రభుత్వం రైతులను ఆదుకోవాలంటూ రైతు సంఘం నాయకులు డిమాండ్!**

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** సకాలంలో వర్షాలు కురకపోవడంతో పాటుగా, కాలవల్లో వ్యవసాయానికి సరిపోను నీరు లేకపోవడంతో రైతులు, కౌలు రైతులు ఎదపెట్టిన వరి పైరు ఎండిపోయిన పరిస్థితులు ఏర్పడినాయని రైతు సంఘం నాయకులు ములకా శివసాంబి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం నాయకులు తెనాలి ప్రాంతంలోని తేలప్రోలు, కంచరపాలెం గ్రామాలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు పర్యటించి రైతులు, కౌలు రైతులు పడుతున్న ఇబ్బందులు గూర్చి తెలుసుకొని పంట పొలాలను పరిశీలించారు. ఈ ప్రభుత్వాలు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంతో రైతులు నష్టపోయారని ఆయన తెలియజేశారు. రైతులతోపాటుగా కౌలు రైతులకు కూడా భరోసా అందిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని ఆయన పేర్కొన్నారు. కౌలు రైతులు ఎకరానికి 32000 కౌలు చెల్లిస్తున్నారని, రైతులకు కౌలు రైతులకు ఈ క్రోప్ విధానంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క రైతుకు సకాలంలో ఎరువులు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకు రుణాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు షేక్ ఇస్మాయిల్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్ వాడీ కేంద్రాల బలోపేతానికి నిబద్ధతతో కృషి చేయాలి:మంత్రి కందుల దుర్గేష్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వ ఆశయాలకు, లక్ష్యాలకు అనుగుణంగా అంగన్ వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మంగళవారం నిడదవోలులోని క్యాంపు కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ నిడదవోలు నియోజకవర్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధికి సంబంధించి నూతనంగా ఎంపికైన ఇద్దరు అంగన్ వాడీ టీచర్లకు, 18 మంది అంగన్ వాడీ హెల్పర్లకు మంత్రి దుర్గేష్ తన చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు సరైన పౌష్టికాహారాన్ని అందిస్తూ, వారి ఆరోగ్య పరిరక్షణతో పాటు ప్రాథమిక విద్యా పునాదులను పటిష్టం చేసేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా నియామక పత్రాలు అందుకున్న అంగన్ వాడీ టీచర్లు మరియు హెల్పర్లు మంత్రి కందుల దుర్గేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సురేష్ అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్) :** తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సురేష్ ఘోర రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. హైదరాబాద్ నుండి రాజమండ్రికి ప్రయాణిస్తుండగా బాపులపాడు మండలం బొమ్మలూరు టోల్‌గేట్ సమీపంలో సంభవించిన ఘోర రోడ్డు ప్రమాదంలో నున్న సురేష్ అకాల మరణం చెందడం పట్ల మంత్రి దుర్గేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో నున్న సురేష్ సతీమణి విమలదేవి తీవ్రంగా గాయపడటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంగళవారం రాజమహేంద్రవరం సమీపంలోని కాతేరులోని నున్న సురేష్ నివాసానికి చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్ ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి అశ్రునయనాలతో ఘన నివాళులర్పించారు. అనంతరం వారి సోదరుడు, తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావును మరియు వారి కుటుంబ సభ్యులను మంత్రి దుర్గేష్ పరామర్శించి, ఓదార్చారు.

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ... విద్యారంగానికి నున్న సురేష్ అందించిన సేవలు మరపురానివని, వారి అకాల మరణం కుటుంబానికే కాక విద్యా రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, ఈ విపత్కర పరిస్థితుల్లో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

## తాటి ఆధారిత ఉత్పత్తులకు విలువ జోడిస్తే రైతులకు మెరుగైన ఆదాయం

- **రంపచోడవరం కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**





రంపచోడవరం(జర్నలిస్ట్ ఫైల్): తాటి ఆధారిత ఉత్పత్తులకు విలువ జోడించి మార్కెట్ అవకాశాలను విస్తరించడం ద్వారా రైతులు, గిరిజనులకు మెరుగైన ఆదాయం అందించవచ్చని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. మంగళవారం రంపచోడవరం నియోజకవర్గంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన సందర్శించి అక్కడ చేపడుతున్న పరిశోధనలు, శిక్షణా కార్యక్రమాలు, సాంకేతిక సేవలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కేంద్రం నిర్వాహకులతో సమావేశమైన మాధవ్ తాటి చెట్టు ఆధారిత ఉత్పత్తులైన తాటి బెల్లం, తాటి పంచదార, తాటి ముంజలు తదితర ఉత్పత్తుల తయారీ విధానాలు, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే తాటి సాగు విస్తరణకు చేపడుతున్న చర్యలు, రైతులు మరియు గిరిజనులకు అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, ఉపాధి కల్పనకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు.

అనంతరం మాధవ్ మాట్లాడుతూ తాటి చెట్టు కేవలం సంప్రదాయానికి ప్రతీక మాత్రమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే కల్పవృక్షమని అన్నారు. తాటి ఆధారిత ఉత్పత్తులకు ఆధునిక సాంకేతికతను జోడించి విలువ పెంచడం ద్వారా రైతులు, గిరిజనులకు అధిక ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

సుస్థిర వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, రైతుల ఆర్థిక స్వావలంబనలో కృషి విజ్ఞాన కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన అన్నారు. రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ నైపుణ్యాలపై మరింత విస్తృతంగా అవగాహన కల్పిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు తాటి ఆధారిత పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందుతాయని అభిప్రాయపడ్డారు. రైతుల ఆదాయ వృద్ధికి తోడ్పడే ఇటువంటి కార్యక్రమాలకు పూర్తి స్థాయిలో ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

## న్యాయమూర్తులకు నగదు రహిత వైద్యసేవలు

**అమరావతి:** దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో న్యాయమూర్తులకు నగదు రహిత వైద్యసేవలు అందించేందుకు రూపొందించిన జోహా (జ్యుడీషియల్ ఆఫీసర్స్ హెల్త్ ఎష్యూరెన్స్) అప్లికేషన్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ మంగళవారం హైకోర్టు ప్రాంగణంలో ప్రారంభించారు. సీజే మాట్లాడుతూ న్యాయం కోసం నిరంతరం కృషిచేస్తున్న న్యాయమూర్తులకు ఈ అప్లికేషన్ గొప్ప వరమన్నారు. దేశంలోనే ఇలాంటి అప్లికేషన్‌ను ఏపీ హైకోర్టులో ప్రారంభించటం సంతోషకరమైన విషయమన్నారు. ఆల్ ఇండియా జడ్జెస్ అసోసియేషన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా న్యాయమూర్తులకు నగదు రహిత వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో యాప్‌ను రూపొందించినట్లు వెల్లడించారు.

## ఇందిరమ్మ ఇల్లు కోసం టవర్ ఎక్కిన కార్మికుడు..

### – సిఐ, కాంగ్రెస్ నేత బాలు చోరవతో టవర్ దిగిన యూనుస్



**మిర్యాలగూడ, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** ఇందిరమ్మ ఇల్లు కోసం పెయింటింగ్ కార్మికుడు యూనుస్ సోమవారం జియో టవర్ ఎక్కి హల్ చల్ చేశాడు. నేను ఆత్మహత్య చేసుకుంటానని, నేను చనిపోయిన తర్వాత నా కుటుంబ సభ్యులకైన ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ప్రధాన డిమాండ్ తో జియో టవర్ ఎక్కి యూనుస్తన ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు అరగంటసేపు ఆ ప్రాంతమంతా ఉద్రిక్తత నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన పెయింటింగ్ కార్మికుడు యూనుస్ నేను, మా నాన్న 35 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉండి పనిచేస్తున్నామని, ఇప్పటివరకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయం తెలిసిన వెంటనే టూటౌన్ సీఐ సోమనర్సయ్య ఆధ్వర్యంలో ఎస్సైలు టవర్ ఎక్కిన యూనుస్ తో ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని నచ్చజెప్పారు. అదేవిధంగా డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటానని ఫోన్లో వివరించగా టవర్ దిగాలని శాంతింప చేశారు. చిలుకూరి బాలు,సీఐ, ప్రత్యేక చొరవతో యూనుస్ టవర్ దిగాడు. ఈ విషయమై మిర్యాలగూడ పట్టణంలో కొద్ది నిమిషాలలోఈ వార్త సంచలనం రేకిత్తించడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఎట్టకేలకు కిందికి దిగడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

## మూడు రోజులపాటు ఆత్మకూర్ రైతు వేదికలో విత్తనమేళా




**ఆత్మకూరు ఎస్, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల కేంద్రంలోని రైతు వేదికలో మూడు రోజులపాటు విత్తనమేళా నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి దంతాల దివ్య తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు వరి సాగు విస్తీర్ణం తగ్గించి ఆరుతడి పంటల విత్తనాలైనా కందులు, ఆముదం, మినుములు, జొన్నలు వంటి ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం ఆత్మకూరు రైతు వేదికలో రైతులకు సరిపడా కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, మిగతా ఏ పంట విత్తనాలు కావాలన్నా తెప్పించి రైతులకు రాయితీలో అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్ సింగ్ ప్రస్తుత వాతావరణం పరిస్థితుల గురించి రైతులకు వివరించారు. మండల అభివృద్ధి అధికారి సునీత మాట్లాడుతూ రైతుల కు కంది విత్తనాలు రైతు వేదిక లో అందుబాటులో ఉన్నాయని. విత్తనాలు కావలసిన రైతులు వ్యవసాయ అధికారి ని సంప్రదించాలి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ ముల్కలపల్లి కాటయ్య , ఎంపీ ఓ ప్రియాంక, వ్యవసాయ విస్తరణ అధికారులు పవన్,సంధ్య, శివ కుమార్, బాలాజీ, ప్రణయ్, రైతులు పాల్గొన్నారు.

## ఆర్.కృష్ణయ్య బీసీ బిడ్డ అయ్యుండి బీజేపీ నేతగా మాట్లాడడం సరికాదు..

### – ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఆయిలయ్య



**యాదాద్రి భువనగిరి జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్‌లోని సీఎల్పీ మీడియా హాల్‌లో సోమవారం రోజున నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య పలు అంశాలపై మీడియా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ బీసీ సంక్షేమం, విద్యా రంగ అభివృద్ధి , రాష్ట్ర ప్రభుత్వ చర్యలు, బీజేపీ నాయకుల వైఖరి పై ఆయన స్పందించారు. ఆర్. కృష్ణయ్య తాను బీసి బిడ్డగా చెప్పుకుంటూ, ప్రస్తుతం బీజేపీ తరపున మాట్లాడుతున్నారని బీర్ల ఐలయ్య విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాం లో బీసీ సంక్షేమ హాస్టళ్లకు సుమారు 6 వేల కోట్ల ఫీజు బకాయిలు పేరుకు పోయి నప్పుడు ఆర్. కృష్ణయ్య ఒక్కసారి కూడా ప్రశ్నించ లేదని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని డైట్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలను గణనీయంగా పెంచిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదే నని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాలకు దేశంలోనే ఆదర్శంగా నిలిచేలా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణను విద్యా రంగంలో అగ్రస్థానం లో నిలపాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని చెప్పారు. విద్యా వ్యవస్థ లో సమూల మార్పులు తీసుకురావాలనే ఉద్దేశం తో ప్రభుత్వం జీఓ-9ను తీసుకువ చ్చిందని, అయితే ప్రస్తుతం ఆ జీఓ న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉందని తెలిపారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యం, అప్పులు, తప్పిదాలను సరిదిద్దుకుంటూ ముందు కు సాగుతున్నామని, ఆగస్టు నెలాఖరు నాటికి విద్యార్థుల ఫీజు బకాయిలన్నీ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి ఇప్పటికే హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అందువల్ల విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. కాస్మొటిక్ చార్జీలను 200 శాతం పెంచిన విషయం కూడా ఆర్. కృష్ణయ్యకు కనిపించడం లేదా అని ప్రశ్నించిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వం 26,674 కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తోందని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం పాఠశాలలను మూసివేసి వైన్ షాపులను పెంచిందని ఆరోపిస్తూ, ప్రజా ప్రభుత్వం మాత్రం పేద విద్యార్థులు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అభ్యసించే అవకాశాలు కల్పిస్తోందని అన్నారు. ఇప్పటికైనా ఆర్.కృష్ణయ్య విమర్శలకు పరిమితం కాకుండా ప్రజా ప్రభుత్వానికి నిర్మాణాత్మక మైన సలహాలు, సూచనలు ఇవ్వాలని బీర్ల ఐలయ్య సూచించారు. అదేవిధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్రాని కి ప్రత్యేకంగా ఏమి ఇచ్చారో బీజేపీ నాయకులు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు కేంద్రం నుంచి తెలంగాణకు ఎలాంటి నిధులు, ప్రాజెక్టులు తీసుకొచ్చారో ప్రజలకు చెప్పాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కోరారు.

## ప్రతి గ్రామంలో విస్తృతస్థాయిలో జలసిరి కార్యక్రమం చేపట్టాలి

### – మండల ప్రత్యేక అధికారి విశాల్ ధార




**ఆత్మకూర్ ఎస్, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** మండలంలోని ప్రతి గ్రామంలో విస్తృత స్థాయిలో జలసిరి కార్యక్రమాన్ని చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి విశాల్ దార పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ లో జలసిరి కార్యక్రమం పై జరిగిన సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, పొలాలలో పంట కుంటలు, ఊట కుంటాలను నిర్మించాలని తెలిపారు. ఇంకుడు గుంతలు నిర్మించడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. అదే విధంగా పంట కుంటలు వ్యవసాయ భూములలో తవ్వించడం వల్ల వర్షపు నీటిని నిలువ చేసి రైతుకు అవసరమైనప్పుడు ఆ నీటిని వాడుకోవచ్చు అని తెలిపారు. మండల అభివృద్ధి అధికారి సునీత మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జలసిరి కార్యక్రమాన్ని ఒక పండుగలా నిర్వహించాలన్నారు. గ్రామంలోని వివో లు ప్రతి ఒక్కరు రెండు పంట కుంటలు తవ్వించే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో అమిన్ సింగ్, ఎంపీ ఓ ప్రియాంక, మండల వ్యవసాయ అధికారి దివ్య, ఏపిఎం రాము, ఏపీఓ ఈశ్వర్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏఈఓ లు, వివో లు తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ కేసు విజయవంతం... ఇద్దరు నిందితులు అరెస్ట్

◆ భువనగిరి డివిజన్ డీఎస్పీ రవీందర్.





**యాదాద్రి భువనగిరి, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ పట్టణంలో వృద్ధ దంపతులను మోసం చేసి బంగారు మంగళసూత్రం అపహరించిన ఇద్దరు నిందితుల అరెస్ట్,చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసులు.యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, భువనగిరి డివిజన్ డీఎస్పీ బి. రవీందర్ పర్యవేక్షణలో బీబీనగర్ పోలీసులు చైన్ స్నాచింగ్ కేసును విజయవంతంగా ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. క్రైం నెం. 241/2026, సెక్షన్ 304(2) బీఎన్ఎస్ కేసు వివరాల ప్రకారం, 2026 జూలై 12న బీబీనగర్‌కు చెందిన కుక్కడువు అందాలు (65) తన భర్తతో కలిసి ఇంటి వద్ద ఉండగా, ద్విచక్రవాహనం పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు మేము ప్రభుత్వ ప్రతి నిధులమని పరిచయం చేసుకుని, “ప్రభుత్వం అందించే ఉచిత బియ్యం పథకానికి సంబంధించిన ఫోటోను అప్లోడ్ చేయాల్సి ఉంది” అంటూ నమ్మించారు. ఫోటో తీసేందుకు మెడలో ఉన్న బంగారు మంగళ సూత్రాన్ని తొలగించాలని చెప్పడంతో బాధితురాలు దానిని తీసి తన భర్తకు ఇచ్చింది. అదే సమయంలో నిందితులు బాధితురాలిని తోసివేసి, ఆమె భర్త చేతిలో ఉన్న సుమారు మూడు తులాల తాళిబొట్టును అపహ రించి ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన బీబీనగర్ పోలీసులు, విశ్వసనీయ సమాచారం మేరకు 2026 జూలై 26న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు.

**అరెస్టైన నిందితులు:**-1 సింహాద్రి గంగాధరప్ప (22), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, సత్యసాయి జిల్లా.

2:- జంగాల శివరాజ్ (38), కర్ణాటక రాష్ట్రం, చిక్కబళ్లాపూర్ జిల్లా.నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నవి:-30 గ్రాముల బంగారు మంగళసూత్రం, ఎన్ఎస్ 200 పల్సర్ మోటార్ సైకిల్ , ఐఫోన్ మొబైల్ ఫోన్ నిందితుల మోసం చేసే విధానం ఇలా...నిందితులు ప్రధానంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుని, ప్రభుత్వ ఉచిత బియ్యం, పెన్షన్, కేవైసీ లేదా ఇతర సంక్షేమ పథకాల పేరుతో నమ్మకం కల్పించి, ఫోటో తీసేందుకు బంగారు గొలుసు లేదా మంగళ సూత్రం తీసేయాలని చెప్పి, ఆభరణాలను అపహరించి పరారయ్యే వారని దర్యాప్తులో వెల్లడైంది. అలాగే, నిందితులపై ఆంధ్రప్రదేశ్ లోని లేపాక్షి, పెనుకొండ, గోరంట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు ఆస్తి నేరాలకు సంబంధించిన కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసును ఛేదించడంలో బీబీనగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం. ప్రభాకర్ రెడ్డి, ఎస్ఐ ఎన్. రమేష్, హెడ్ కానిస్టేబుల్ బి. అంజయ్య, పోలీస్ కానిస్టేబుళ్లు పి. శ్రీనివాస్, జి. జనార్దన్, అలాగే భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కొండారెడ్డి, రమేష్ విశేష కృషి చేశారు. ప్రజలకు పలు సూచనలు.యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు ప్రజలను అప్ర మత్తంగా ఉండాలని కోరుతున్నారు. ప్రభుత్వ పథకాల పేరుతో ఇంటికి వచ్చే గుర్తు తెలియని వ్యక్తుల ను నమ్మ వద్దు. బంగారు ఆభరణాలను ఎవరికీ అప్పగించవద్దు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు.

## ఫంక్షన్ హాల్స్ యాజమాన్యులు మైనర్లను పనిలో పెట్టుకో రాదు..

- ఫంక్షన్ హాల్స్ యజ మాన్యులతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం
- నిబంధనలు ఉల్లంఘిస్తే ట్రేడ్ లైసెన్సులు రద్దు,హాల్ సీజ్
- ప్లాస్టిక్ వస్తువులకు బదులు స్టీల్ వస్తువులు వాడాలి
- హాల్ యజమానులను హెచ్చరించిన అదనపు కలెక్టర్ భాస్కరరావు అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ



**యాదాద్రి భువన గిరి, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** పర్యావరణ పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఫంక్షన్ హాల్స్ యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం రోజు అదనపు కలెక్టర్ ఛాంబర్ లో అడిషనల్ ఎస్పీ లక్ష్మి నారాయణ లతో కలసి అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఫంక్షన్ హాల్స్ యజమాను లతో అవగాహన సమావేశం నిర్వ హించారు. మున్సిపాలిటీ పరిధిలో పర్యావరణ పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, నీటి సంరక్షణకు సంబంధించిన ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఫంక్షన్ హాల్ యజమాని తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు ఫంక్షన్ హాల్స్‌ను సీజ్ చేసే వరకు కఠిన చర్యలు తీసు కుంటామని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు హెచ్చరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్స రాల లోపు బాల కార్మికులు లేదా మైనర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ పనిలో నియమించరాదని స్పష్టం చేశారు. ఫంక్షన్ హాల్స్‌లో ఒకసారి విని యోగించి పారవేసే ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, చెంచాలు, ఫోర్కులు తదితర వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు. వాటి స్థానంలో స్టీల్ పాత్రలు, ఆకుల విస్తర్లు, కాగితంతో తయారైన పర్యావర ణహిత వస్తువులను వినియోగించాలని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు వంటలు, శుభ్రపరిచే పనులకు అవసరమైన మేరకే నీటిని వినియో గించాలని, కుళాయిలు లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని, వాడిన నీటిని తోటల నిర్వహణ, శుభ్రత పనులకు పునర్వినియోగం చేయాలని సూచించారు.ప్రతి ఫంక్షన్ హాల్‌లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్ తప్పనిసరిగా ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థ లేని ఫంక్షన్ హాల్స్‌కు అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఈ నాలుగు నిబంధనలను అమలు చేయని ఫంక్షన్ హాల్స్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ట్రేడ్ లైసెన్సులను రద్దు చేసి ఫంక్షన్ హాల్స్‌ను సీజ్ చేస్తామని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. స్వచ్ఛ భారత్ లక్ష్యాల సాధన, పర్యావరణ కాలుష్య నియంత్రణ, భూగర్భ జలాల పరి రక్షణలో ఫంక్షన్ హాల్స్ యజమానులు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భువనగిరి మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, భువనగిరి పట్టణంలోని ఫంక్షన్ హాల్స్ యజ మానులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ఎఫెక్ట్...రైతులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి...
- ఫార్మ్ పాండ్స్,ఓపెన్ వెల్స్ నిర్మించుకోవాలి...
- రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల కీలక సూచనలు...



**మఠంపల్లి, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హుజూర్‌నగర్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల ప్రత్యేక అధికారి రవి నాయక్ సూచించారు.సోమవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురిసే అవకాశం ఉండటంతో పాటు, వర్షాకాలంలో దీర్ఘకాలిక వర్ష విరామాలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు.ఈ పరిస్థితుల వల్ల సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదై ఖరీఫ్ పంటల పెరుగుదలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.రైతులు సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.ముఖ్యంగా నీటి అవసరం అధికంగా ఉండే వరి సాగును వీలైనంత వరకు తగ్గించాలని కోరారు.చెరువులు,బోరు బావుల కింద కూడా వరి సాగు చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో శ్రేయస్కరం కాదని స్పష్టం చేశారు.భూగర్భ జలాలను అధికంగా వినియోగిస్తే భవిష్యత్తులో తాగునీటి సమస్య కూడా తీవ్రంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు ఆరుతడి పంటలైన కందులు,పెసర, మినుము, జొన్న,సజ్జ, రాగులు,నువ్వులు,ఉలవలు,వేరు శెనగ మరియు ఉద్యానవన పంటలు కూరగాయలు, పండ్లు,పూల, మునగ మరియు ఆయిల్ పామ్ తదితర పంటలను ఎంచుకో వాలని సూచించారు. అలాగే ఉద్యానవన శాఖ తరపున కూరగా యల పందిరిలు,స్ప్రింకర్లు,డ్రిప్ మరియు కూరగాయల విత్తనాలు,నార్లపై అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.అదే విధంగా విత్తన మేళాలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న పలు రకాల విత్తనాలను సొసైటీ లో అందుబాటులో ఉంచామని వినియోగించుకోవాలని చెప్పారు.వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన స్వల్పకాలిక,కరవును తట్టుకునే విత్తన రకాలను మాత్రమే ఉపయోగించాలని పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీవో సుమంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టేందుకు తమ వ్యవసాయ క్షేత్రాల్లో ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మ్ పాండ్స్ (పంట కుంటలు) నిర్మించుకోవాలని, అవసరమైన చోట ఓపెన్ వెల్స్,ఇంకుడు గుంతలు,రీచార్జ్ బోర్ వెల్స్ తదితర నిర్మాణాలను విబి జి రామ్ జి ఉపాధి హామీ పథకం కింద తవ్వించుకోవాలని సూచించారు. కురిసే ప్రతి వర్షపు నీటిని నిల్వ చేసుకుని అవసరమైన సమయంలో వినియోగించుకోవడం ద్వారా పంటలను రక్షించుకో వచ్చన్నారు. నీటి సంరక్షణ చర్యలు భవిష్యత్తులో రైతులకు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు.అనంతరం మండల వ్యవసాయాధికారి బి శ్రీనివాస్ మాట్లాడుతూ వాతావరణ శాఖ రోజువారీగా జారీ చేసే హెచ్చరికలు,సూచనలను రైతులు తప్పనిసరిగా గమనిస్తూ వ్యవసాయ అధికారుల సలహాలను పాటిస్తూ శాస్త్రీయ సాగు విధానాలను అనుసరించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ హిమ బిందు మాట్లాడుతూ ఎల్ నినో ముప్పును ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు తీసుకుంటే దిగుబడి నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం పాక్స్ కేంద్రంలో రైతులకు రాయితీపై పలు రకాల పంట విత్తనాలను పంపిణీ చేశారు.

## తాజ్పూర్ గ్రామంలో ఇంటింటికి ఇంకుడు గుంత..

### – సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్.





**యాదాద్రి భువనగిరి, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్ పూర్ లో గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోషా శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం విబిజీ రామ్ పథకం క్రింద ఊరికోక ఊట కుంట, ప్రతి రైతుకు ఫారం పండ్లు, గ్రామంలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఆదేశించడం జరిగింది.ఇందులో భాగంగా సోమవారం రోజు సర్పంచ్ నూతనంగా గ్రామ పంచాయతీ తరుపున ఏర్పాటు చేసిన ఫారమ్ పండ్ ను పరిశీలించడం జరిగింది. నూతనంగా నిర్మాణమైన ఇండ్లు, ఇతర ఇంకుడు గుంతలు లేని ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించడం తోపాటు నేడు దాదాపు 20 ఇంకుడు గుంతలకు ముగ్గు పోసి పనులు ప్రారంభించడం జరిగింది. అదే విధంగా గతంలో నిర్మించిన ఇంకుడు గుంతలు పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాత్రమే కాదు గ్రామంలో ఇంకా ఎవరైనా సరే ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించడం జరిగింది. దీనివల్ల భూగర్భ జలాలు ఎక్కువగా పెరుగు తాయని మురికి నీరు నిల్వ కాకుండా ఉండడం వల్ల అంటు రోగాలు ప్రబల కుండా ఉంటాయని కచ్చితంగా ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంత నిర్మించు కోవాలని ఇందుకు గాను కేంద్ర ప్రభుత్వం ప్రతి ఒక్క ఇంకుడు గుంతకు 6500/- చెల్లిస్తుంది. కావున ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకొని గ్రామ ప్రజలు గ్రామ పంచాయతీ కి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో సామాజిక వేత్త డా. ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నర్సింగ్ రావు, ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, మహ్మద్ గాలిబీ యాకుబ్, బొమ్మారపు రామక్రిష్ణ, లక్ష్మి బాల్ రాజ్, బీట్కూరి మహేష్, వరిగంటి మానస నాగరాజు, షేక్ అహ్మద్, రామస్వామి, కారోబార్ సుగుణాకర్ గ్రామ ఇళ్లకు సంబందించిన యజ మాన్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి తగాదాలలో సొంత తల్లిదండ్రులపై దాడి

- వీల్‌చైర్‌లో ఉన్న వృద్ధుడిపై చెప్పుతో దాడి
- కేసు వెనక్కి తీసుకోకుంటే ట్రాక్టర్‌తో తొక్కిస్తామంటూ బెదిరింపులు
- పోలీసులపై ఆరోపణలు.. ప్రాణ రక్షణ కల్పించాలని ఆర్డీవోను ఆశ్రయించిన వృద్ధ దంపతులు



**మిర్యాలగూడ, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆస్తి కోసం కన్నతల్లిదండ్రులపైనే కుటుంబ సభ్యులు వేధింపులకు పాల్పడుతున్న ఘటన నల్గొండ జిల్లా వేములపల్లి మండలంలో వెలుగుచూ సింది. మండలంలోని శెట్టిపాలెం గ్రామానికి చెందిన గగ్గనపల్లి బుచ్చిరెడ్డి, అనసూయ దంపతులు తమకున్న ఆస్తిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచినట్లు తెలిపారు. అయితే వృద్ధాప్యంలో తమ వైద్య ఖర్చుల కోసం ఉంచుకున్న మూడు ఎకరాల 11 గుంటల భూమిని తమను చూసుకుంటున్న మనవడి పేరిట రిజిస్ట్రేషన్ చేయడంతో.. ఆ భూమిలోనూ వాటా కావాలని పెద్ద కుమారుడు శ్రీనివా స్‌రెడ్డి కుటుంబ సభ్యులు తమను వేధిస్తున్నారని వృద్ధ దంపతులు ఆరోపించారు.గతంలో వీల్‌చైర్ లో ఉన్న తనపై పెద్ద కోడలు చెప్పుతో దాడి చేసిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించినప్పటికీ.. వేధింపులు మాత్రం ఆగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేసును ఉపసంహ రించుకోవాలని, లేకపోతే ట్రాక్టర్‌తో తొక్కిస్తామంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. దీంతో తమకు రక్షణ కల్పించాలని కోరుతూ వేములపల్లి పోలీసులను ఆశ్రయించి నట్లు తెలిపారు.అయితే తమ ఫిర్యాదుపై స్పందించాల్సిన వేములపల్లి ఎస్ఐ తమపైనే దురుసుగా వ్యవహరిస్తూ బూతులు తిట్టారని వృద్ధ దంపతులు ఆరోపించారు. ఒకవైపు కుమారుడు, కుటుంబ సభ్యుల వేధింపులు.. మరోవైపు పోలీసుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన వారు మిర్యాలగూడ ఆర్డీవోను ఆశ్రయించారు.తమకు తక్షణమే ప్రాణ రక్షణ కల్పించి, తమను వేధిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. తమకు న్యాయం జరగని పక్షంలో 'కారుణ్య మరణానికి' అనుమతి ఇవ్వాలని కోరడం కలకలం రేపింది. వృద్ధ దంపతుల ఫిర్యాదుపై అధికా రులు స్పందించి, తమకు న్యాయం చేయాలని వారు వేడుకున్నారు.

## ఆగస్టు 15 లోపు "జలసిరి" పనులను పూర్తి చేయాలి

**నిజామాబాద్, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు వీలుగా గ్రామ గ్రామాన జలసిరి కార్యక్రమాలను విస్తృత స్థాయిలో చేపట్టాలని అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి అనంతరం ఆయన అధికారులతో సమీక్ష జరిపారు.ఈ నెల 28న అన్ని మండలాలలో మండల స్థాయి సభలు నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారులకు సూచించారు.అదేవిధంగా 29,30 తేదీలలో గ్రామ పంచాయతీల స్థాయిలో గ్రామ సభలు జరపాలని అన్నారు.ఈ సభలలో ఎల్ నినో ప్రభావం గురించి,జల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.వర్షపు నీటిని ఒడిసిపట్టేలా వీబీజీ రామ్-జీ పథకం కింద విరివిగా ఇంకుడుగుంతలు,ఊట కుంటలు,పంట కుంటలు,బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి జాబ్ కార్డు కలిగిన కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించాలని అన్నారు.ఆగస్టు 15వ తేదీ నాటికి అన్ని గ్రామాలలో ఈ పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు.గ్రామీణ నీటి సరఫరా,పంచాయతీరాజ్ ఇంజినీరిం.గ్ అధికారులు,ఎం.పీ.డీ.ఓలు,ఎం.పీ.ఓలు,ఏ.పీ.ఓ లు,ఏ.ఈ.ఓ లు,వీ.ఓ లు,స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు ఇలా అందరినీ భాగస్వామ్యం చేస్తూ నిర్ణీత గడువులోపు జలసిరి కార్యక్రమాలు అమలయ్యేలా చొరవ చూపాలని అన్నారు.ప్రతి



ఇంటికి ఒక ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు.వాటర్ షెడ్ నిర్మాణాల ద్వారా నీటి సంరక్షణ జరగడంతో పాటు కూలీలకు ఉపాధి కల్పించి పని దినాల లక్ష్యాన్ని సాధించవచ్చని సూచించారు.ప్రతి గ్రామంలో ప్రతి రోజు సగటున 60 మందికి పని కల్పించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు.భూగర్భ జలాల పెంపునకు దోహదపడే జలసిరి కార్యక్రమాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అదేవిధంగా వీ.ఓ భవన నిర్మాణ పనులను కూడా నవంబర్ 15 లోపు పూర్తి చేయాలని సూచించారు.సమీక్షా సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సురేష్,డీఆర్ఓ గీత,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్,డీ.ఆర్.డీ.ఓ సాయన్న సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 166 ఫిర్యాదులు

**నిజామాబాద్, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 166 ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావుతో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్,డీఆర్ఓ గీత,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,జెడ్పీ సీఈఓ సాయాగౌడ్,డీఆర్డీఓ సాయన్న లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా,అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారు



లను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ జేఏసీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ - మాజీ ఎమ్మెల్యే

**షాద్‌నగర్, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :**

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఉద్యమం మరింత ఉధృతమవుతోంది. సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన తొలి సమావేశం విజయవంతంగా జరిగింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐతో పాటు కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జీవో 641 రద్దు చేయాలని డిమాండ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్దాపూర్ గ్రామంలో ఎకో పార్క్ పేరుతో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు జూలై 2న జీవో 641ను తీసుకువచ్చిందని జేఏసీ నాయకులు తెలిపారు. జీవో జారీకి ముందే సిద్దాపూర్ గ్రామ ప్రజలు డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టి, పెద్ద ఎత్తున చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారని పేర్కొన్నారు. గతంలో ప్రస్తుత ఎమ్మెల్యే శంకరయ్య డంపింగ్ యార్డును రానివ్వబోమని హామీ ఇచ్చారని, అయితే ఆయన హామీ ఇచ్చిన వారం రోజులకే జీవో రావడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారని జేఏసీ నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో జీవో 641ను రద్దు చేసే వరకు ప్రత్యక్ష కార్యాచరణ రూపొందించి, ప్రజా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను ఏకతాటిపైకి తీసుకువస్తూ సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డంపింగ్ యార్డుతో ప్రజలకు తీవ్ర నష్టం: జేఏసీ జేఏసీ చైర్మన్ రాంబల్ నాయక్ అధ్యక్షతన జరిగిన తొలి సమావేశంలో నాయకులు గ్రామ ప్రజలకు డంపింగ్ యార్డు వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. డంపింగ్ యార్డు ఏర్పాటుతో పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు చెరువులు, కుంటలు, భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో చేపట్టే ప్రతి కార్యక్రమంలో గ్రామ ప్రజలు భాగస్వాములై ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. జీవో 641 రద్దు అయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల కోసం చేపట్టే ప్రతి కార్యక్రమానికి అండగా ఉంటా: అంజయ్య యాదవ్ సమావేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూ పరిశ్రమల ఏర్పాటుకు భూములు సమీకరించామని, ప్రస్తుత ప్రభుత్వం అదే ప్రాంతాన్ని డంపింగ్ యార్డు కోసం కేటాయించడం దారుణమని అన్నారు.ప్రజల కోసం పనిచేసే ప్రజా సంఘాలు, జేఏసీ నాయకులు ఏ




కార్యక్రమం చేపట్టినా వారి వెంట నడుస్తానని హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డు ఏర్పాటైతే సిద్దాపూర్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమై ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు చేపట్టిన ఈ పోరాటంలో విజయం సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు. జేఏసీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ అనంతరం సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ రూపొందించిన వాల్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత విస్తృతం చేసి, అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కార్యాచరణ రూపొందిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు.పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులుఈ కార్యక్రమంలో సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ రాంబల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, సలహాదారులు వంగూరి గంగిరెడ్డి, అబ్దుల్ రబ్ జామి, రాజవరప్రసాద్, కో-చైర్మన్లు దొడ్డి శ్రీనివాస్, ఎమ్మె సత్యనారాయణ, బొజ్జా శ్రీనివాస్ రెడ్డి, వడ్డె బాలయ్య, రజిత నాయక్, బుద్దల జంగయ్య, ఈశ్వర్ నాయక్, రవీంద్రనాథ్, టి.జి. శ్రీనివాస్, అర్జున్, శ్రీకాంత్, ఆకాశ్ నాయక్, పెంటనోళ్ల నర్సింహ, బచ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.అలాగే వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లెల వెంకట్ రెడ్డి, ఈట గణేష్, వంకాయల నారాయణ రెడ్డి, కోస్గి శ్రీనివాస్, దేవేందర్ యాదవ్, రవీందర్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, సిద్దాపూర్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన డిపిఓ వినోద్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్‌జీవోస్ యూనియన్ నాయకులు




**ఖమ్మం, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్)** గ్రూప్-1 పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఖమ్మం జిల్లా నూతన జిల్లా పంచాయతీ అధికారిగా (డిపిఓ) నియామకం పొందిన వినోద్ కుమార్ ని సోమవారం నూతన కలెక్టరేట్ (ఐడిఓసి) లోని వారి ఛాంబర్‌లో టీఎన్‌జీవోస్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, గ్రామ పంచాయతీల బలోపేతం, ఉద్యోగులు, అధికారుల మధ్య సమన్వయంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. వినోద్ కుమార్ కూడా ఉద్యోగ సంఘాల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్.ఎస్. జైపాల్, జిల్లా కోశాధికారి వల్లపు వెంకన్న, అసోసియేట్ అధ్యక్షులు కొమరగిరి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు ఎర్ర రమేష్, జిల్లా మైనారిటీస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు అస్లాం, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఫజల్, జిల్లా కార్యదర్శి వినోద్, వైస్ ప్రెసిడెంట్లు తిరుపతిరావు, ఉపేందర్, రాంలాల్ , జాయింట్ సెక్రటరీలు రమేష్ , శ్రీనివాస్, రాజ్‌కుమార్, మహిళా విభాగ బాధ్యులు రాధారాణి, అలాగే పంచాయతీ కార్యదర్శులు తిరుపతి రావు, ప్రవీణ్ , విక్రమ్ , జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన వ్యాపార రంగంలో రాణించాలి




**షాద్‌నగర్, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పరిధిలోని యువత స్వశక్తితో వ్యాపార రంగంలో అడుగుపెట్టి నైపుణ్యాలను పెంపొందించుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల కేంద్రంలోని పెంజెర్ల రోడ్ లో కొత్తూరు మండల బిజెపి మాజీ అధ్యక్షులు మల్ రెడ్డి మహేందర్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాటరీ షోరూమ్ ను బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమం నిర్వహించి యజమాని మల్ రెడ్డి మహేందర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన పరికరాలను అందజేస్తూ వారి ప్రశంసలు పొందాలని, వ్యాపారంలో ఆర్థిక అభివృద్ధి సాధించి పలువురు యువతకు ఉపాధి కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మండల్ భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, బాల్ శివ రెడ్డి, పుల్లా రెడ్డి,ఎమ్మె ప్రవీణ్, నరసింహ యాదవ్,నందిగామ,నరసింహ,ఎమ్మెబాలరాజ్,ఎమ్మె,శ్రీశైలం,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ : దారూర్ ఎంపీడీవో నర్సిములు



**వికారాబాద్, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లా దారూర్ మండలం లోని గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలుకు ప్రత్యేక ప్రణాళికలతో నిరంతరం కృషి చేస్తున్నట్లు మండల ఎంపీడీవో నర్సిములు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని హరిదాస్‌పల్లి గ్రామ పంచాయతీని సందర్శించిన ఆయన, గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, పంచాయతీ రికార్డులను పరిశీలించారు.రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో గ్రామంలోని పూరిగుడిసెలో నివసిస్తున్న ఒక కుటుంబాన్ని నేరుగా కలిసి వారి పరిస్థితిని పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించి, పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలోని మౌలిక సదుపాయాలపై సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్యతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి మండల పరిషత్ ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపడుతుందని ఎంపీడీవో నర్సిములు తెలిపారు.ఈ పర్యటనలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ అర్చన తదితర అధికారులు పాల్గొన్నారు.

## అపర శబరి పోకల దమ్మక్క సేవా యాత్రకు ఐటిడిఏ పీవో బి. రాహుల్‌కు ఆహ్వానం...



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** అపర శబరి పోకల దమ్మక్క సేవా యాత్రలో పాల్గొనాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్‌ను శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అధికారులు సోమవారం మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. దేవస్థాన కార్యనిర్వాహణ అధికారి దామోదర్ రావు ఆదేశాల మేరకు సహాయ కార్యనిర్వాహణ అధికారి (ఏఈఓ) భవాని రామకృష్ణ, అర్చక స్వాములు ఐటిడిఏ పీవోను ఆయన కార్యాలయంలో కలిసి మంత్రోచ్ఛారణల మధ్య తీర్థప్రసాదాలు అందజేసి సేవా యాత్ర ఆహ్వాన పత్రికను సమర్పించారు.ఈ సందర్భంగా పీవో బి. రాహుల్ మాట్లాడుతూ, శ్రీ సీతారామచంద్రస్వామి అనుగ్రహానికి పాత్రురాలైన పోకల దమ్మక్క సేవా యాత్రకు వివిధ గిరిజన గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతున్నందున ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా నిర్వహించాలని సూచించారు. ఆలయ ఆచారాలు, పూజా విధానాలు పురాతన సంప్రదాయాలకు అనుగుణంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని దేవస్థాన అధికారులకు తెలిపారు.అలాగే సేవా యాత్ర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లు, తాగునీరు, వైద్య సేవలు, శాంతిభద్రతలు తదితర సౌకర్యాలను సమకూర్చాలని సూచించారు. భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ భవాని రామకృష్ణ, పర్యవేక్షకుడు శ్రీనివాసరెడ్డి, అర్చక స్వాములు విష్ణు, ఎస్.వి. మదనమోహన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కుల కోసం తెలంగాణ నుంచి ఢిల్లీలో గళమెత్తిన టిడబ్లూజేఎఫ్




**హైదరాబాద్, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్లూజేఎఫ్) తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకులు అధ్యక్షులు మామిడి సోమయ్య ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాకు విశేష స్పందన లభించింది. ఈ నిరసన కార్యక్రమాన్ని పలు జాతీయ మీడియా సంస్థలు విస్తృతంగా కవర్ చేయడం విశేషం.తెలంగాణ నుంచి జర్నలిస్టుల హక్కుల కోసం జాతీయ రాజధానిలో పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించడం అభినందనీయమని పలువురు జాతీయ మీడియా ప్రతినిధులు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పాత్రికేయుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ముందుండి పోరాటం చేయడం గొప్ప విషయమని వారు అభిప్రాయపడ్డారు.ధర్నా కార్యక్రమంలో జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక డిమాండ్ల 2019లో కరోనా సమయంలో జర్నలిస్టులకు రైల్వే పాసు రాయితీ సదుపాయాన్ని ఉపసంహరించడం జరిగిందిమరియు జాతీయస్థాయిలో మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి పార్లమెంట్లో బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో జర్నలిస్టులకు సంబంధించి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని దాని ద్వారా అర్హులైన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు ఉచిత హెల్త్ కార్డ్స్ ఇళ్ల స్థలాలు పిల్లలకు విద్య వైద్యం ఉచితంగా అందించాలని వారు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జర్నలిస్టులు కూడా టీడబ్ల్యూజేఎఫ్ చేపట్టిన ఈ ఉద్యమానికి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పాత్రికేయుని హక్కుల కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.జాతీయ మీడియా విస్తృత కవరేజ్ తో ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కు దక్కిన గుర్తింపుగా పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారుఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నాగేష్, కోశాధికారి వేములకొండ రమేష్ , నేషనల్ కౌన్సిల్ మెంబర్ వెలుగోటి వెంకట్, జిల్లా సభ్యులు మామిడాల కిరణ్, కప్పల మధు,గుజ్జు గోపాలకృష్ణ, వెలిశెట్టి రామకృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షానికి ఇల్లు కూలిన ఘటన.. బాధిత కుటుంబానికి అండగా అర్ధ సుధాకర్ రెడ్డి

**వికారాబాద్, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :**



వికారాబాద్: గత రాత్రి కురిసిన భారీ వర్షాలకు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు గిరిగెటిపల్లిలో ఒక ఇల్లు కూలిపోవడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పేందుకు మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించారు.భారీ వర్షాల కారణంగా ఇల్లు కూలిపోయిన విషయాన్ని తెలుసుకున్న వెంటనే అర్ధ సుధాకర్ రెడ్డి అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పడంతో పాటు అవసరమైన తక్షణ సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా కాంగ్రెస్ పార్టీ వారి వెంటే నిలుస్తుందని, బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు.ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ రెడ్యా నాయక్, బుచ్చయ్య, నరసింహులు, రెడ్డి శేఖర్, వడ్డే శ్రీను, కురువ వెంకటయ్య తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబానికి సంఘీభావం ప్రకటించారు. స్థానికులు కూడా బాధితులకు అవసరమైన సహాయం అందించాలని కోరారు.

## హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయాలి.. హైడ్రా కమిషనర్‌ను తొలగించాలి : డాక్టర్ మెతుకు ఆనంద్



**వికారాబాద్, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్: హైకోర్టుఆదేశాలను తెలంగాణ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ చట్టాలను పక్కనపెట్టి వ్యవహరించే అధికారులపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ వైఖరిపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తాయని ఆయన పేర్కొన్నారు. న్యాయస్థానం సూచనలను గౌరవించి చట్టబద్ధమైన విధానాల ప్రకారం ప్రభుత్వం వ్యవహరించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని అన్నారు. ప్రజల ఇళ్ల విషయంలో చట్టపరమైన ప్రక్రియలను పాటించకుండా తీసుకునే చర్యలు సమర్థనీయం కావని అభిప్రాయపడ్డారు.హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను బలిపశువుగా చేసి ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయకూడదని ఆయన విమర్శించారు. తప్పులు జరిగినట్లయితే వాటికి బాధ్యులైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఒక్క అధికారిపైనే నెపం మోపడం సరైన విధానం కాదన్నారు.ప్రజల హక్కులను కాపాడాల్సిన అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడితే ప్రభుత్వం మౌనంగా ఉండకూడదని, చట్టం ముందు అందరూ సమానమేనని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆస్తులు, హక్కులను పరిరక్షిస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించాలని డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు.

## గ్రామ ప్రజల అంగడి భూములను కాపాడాలని ఆర్డీవో కు వినతి పత్రం అందజేత



**నిజామాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** అంగడి భూములను అన్యాకాంతం కాకుండా కాపాడాలని ఆర్డీవో రాజేంద్ర కుమార్‌ను కలిసి వినతి పత్రని అందజేసిన, సిరికొండ గ్రామపంచాయతీ పాలకవర్గం, సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఈ సందర్భంగా సర్పంచ్ సాయి చరణ్ , వి డి సి చైర్మన్ సాయన్న లు మాట్లాడుతూ గత 25 సంవత్సరాల క్రితం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు వివిధ కుల సంఘాల ద్వారా డబ్బులను జమ చేసి వారాంతపు సంత కోసం సిరికొండ గ్రామ ప్రజల నుండి భూమిని కొనుగోలు చేశారని, గత 25 సంవత్సరాలుగా అందులో అంగడి బజార్ ను, నిర్వహిస్తున్నారని, వర్తకులకోసం,ప్రజల కోసం మంచినీటి సౌకర్యం కోసం బోరు తవ్వించి మంచినీటి సౌకర్యాన్ని కల్పించామని మహిళల కోసం వాష్ రూమ్ లు నిర్మించామని, సిరికొండ గ్రామ ప్రజల అవసరాల కోసం ప్రభుత్వ నిధులతో దోబిగాట్ నిర్మించామని, కరెంటు సమస్య పరిష్కరించేందుకు ట్రాన్స్ఫార్మర్ను కూడా అంగడి బజార్లో ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్డీవో దృష్టికి, గ్రామ సర్పంచ్,చైర్మన్ లు తీసుకెళ్లారు, సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం సిరికొండ తహసిల్దార్ చేత విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాల క్రితం అంగడి కోసం కొనుగోలు చేసిన భూమినీ ఎవరు కొనుగోలు చేసిన అమ్మిన చెల్లుబాటు కాదని, కొనేవారు గుర్తుంచుకోవాలని, తర్వాత బాధపడితే లాభం లేదని, ప్రజలకు సూచించారు. ఆర్డీవోను కలిసిన వారిలో సర్పంచ్ సాయి చరణ్, వార్డు సభ్యులు, శంకర్ రంజిత్, ఎల్లయ్య, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ సాయన్న పారేపల్లి శివ, క్యాషియర్ గణేష్ గౌడ్, కార్యదర్శి రాజన్న, సలదారులు శ్రీనివాస్, సతీష్ ప్రవీణ్, రాజన్న, తదితరులు ఉన్నారు

## కోసూరి రమేష్ గౌడ్ మృతి



**ఖమ్మం, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం సుడా మాజీ డైరెక్టర్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు కోసూరి రమేష్ గౌడ్ మృతి పట్ల రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆవేదన చెందారు . రమేష్ మృతి కాంగ్రెస్ పార్టీకే కాక తనకు వ్యక్తి గతంగా తీరనిలోటని తెలిపారు . ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, త్రీ టౌన్ ఏరియా పార్టీ కోఆర్డినేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్ అధ్యక్షతన కోసూరి రమేష్ స్వగృహంలో సంతాప సభ జరిగింది . సంతాపసభ రమేష్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని , సంతాపాన్ని వ్యక్తం చేసింది . ఖమ్మం నగరంలోని కోసూరి స్వగృహానికి వెళ్లి నివాళులర్పించిన తుమ్మల మాట్లాడుతూ రమేష్ ఆది నుంచి తన వెంటే ఉంటూ మంచి రాజకీయ నాయకుడిగా పేరుందారన్నారు . నిరాడంబర జీవితం గడిపిన రమేష్ నిగర్వి అన్నారు. రమేష్ గౌడ్ మరణం పార్టీకి , స్థానిక ప్రజలకు తీరని లోటని ఆయన పేర్కొన్నారు . రమేష్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ కష్ట సమయంలో భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు గుండె నిబ్బరాన్ని , మనో ధైర్యాన్ని ప్రసాదించాలని తుమ్మల ఆకాంక్షించారు. మంత్రి తుమ్మలతో పాటు మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పలువురు నాయకులు, బంధు మిత్రులు అందరు రమేష్ గౌడ్ సంతాప సభలో ప్రసంగించారు . రమేష్ తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకొన్నారు . రమేష్ మృతి తమ అందరికీ తీరని లోటు తెలిపారు . ఈ కార్యక్రమంలో డిసిసి ఖమ్మం కార్పోరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్ బాబా , మాజీ మేయర్ పూనకొల్లు నీరజ, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వరి కి బదులు ప్రత్యామ్నయం పంటల పై దృష్టి సారించండి



**ఖమ్మం, జూలై 28 (జర్నలిస్ట్ ఫైల్) :** నవరికి బదులు గా ప్రత్యామ్నం పంటల పై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి దనసరి పుల్లయ్య సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో సోమవారం నిర్వహించిన విత్తన మేళా లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. ప్రస్తుత పరిస్థితులలో రైతులు వరి పంటకు దూరంగా ఉండాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు ను తట్టుకునే పప్పు దినుసులను సాగు చేసుకోవాలని సూచించారు. ఆరుతడి పంటలకు రైతులు సబ్సీడీ పై విత్తనాలు ఇవ్వాలని జిల్లా. వ్యాప్తంగా రైతులు కోరుతున్నారని...ఆ విషయం ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. రైతులను చైతన్యం చేసేందుకు ప్రతీ గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బోరుబావులను నమ్ముకుని వరి సాగు చేసి రైతులు నష్టపోకూడదన్నారు. భూగర్భజలాలు అడుగంటుతున్నాయని అన్నారు. ఎట్టి పరిస్థితులలో సాగు కు నీరు వచ్చే అవకాశం లేదన్నారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని సూచించారు. ఒక పక్క నీటి కొరత, మరో పక్క విద్యుత్ సమస్య వెంటాడుతుందన్నారు. కావునా రైతులు పప్పు దినుసులు, తక్కువ నీటి శాతం అవసరం ఉన్న పంటలను సాగు చేయాలన్నారు. జిల్లాలో 12 మండలాలలో సాధారణ వర్షపాతం ఉందన్నారు. అందులో 7 మండలాలలో తక్కువ వర్షం పడగా...అతి తక్కువగా కూసుమంచి మండలంలో –60 శాతం, ఎర్రుపాలెం –71 శాతం నమోదైన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ మండలం లో ఒక రైతు వేదిక లో విత్తనమేళా ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు విత్తన మేళా ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజేష్కుమార్.మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మండల వ్యవసాయాధికారి యం.రాధ, రైతు ప్రతినిధులు మేకల వెంకటేశ్వర్లు, గరిడేపల్లి రామారావు, విత్తన డీలర్లు గెల్లా వెంకటేశ్వరరావు, రామారావు, వ్యవసాయ విస్తీరణాధికారులు అరవింద్. దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

## ఐటి హబ్‌లో భాగస్వామ్యం కావాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు ఐటి హబ్ గా అభివృద్ధి చెందుటకు నగరవాసులు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. జిల్లాను ఐటి హబ్ గా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కమర్షియల్ భవనాలు, కార్యాలయ స్థలాలు, భూములు ఉన్న యజమానులు https://itinfra.ap.gov.in వెబ్ సైట్ లో ఉచితంగా పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. ఆస్తులను విక్రయించేందుకు, అద్దెకు, లీజుకు ఇవ్వడానికి ఆసక్తి ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముంగళవరం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు.

## లోకేష్ రాజీనామా చేయాల్సిందే.. డీఎస్సీ అక్రమాలపై చర్చకు రావాలి




- పానుగంటి చైతన్య

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** డీఎస్సీ నిర్వహణలో అవకతవకలు, అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య డిమాండ్ చేశారు. డీఎస్సీ అంశంపై దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. గుంటూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో జరిగిన భారీ నిరసన ర్యాలీలో ఆయన మాట్లాడారు. శంకర్‌విలాస్ నుంచి లాడ్జి సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు, డీఎస్సీ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్కిట్లు, ఫ్లాష్ మాబ్‌లు, చెవిలో పూలు, సంకెళ్లు, ఉరితాళ్ల ప్రదర్శనలు, వివిధ వినూత్న కార్యక్రమాలతో తమ నిరసన తెలిపారు. డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి అమలు చేయాలని చైతన్య డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన డీఎస్సీ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్యార్థులు, యువత తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా పోరాడుతున్నారని, వారి సహనాన్ని ప్రభుత్వం పరీక్షిస్తే ఉద్యమం మరింత ఉద్ధృతమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ఎస్‌యూ, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రత్నాల చెరువులో ఇంటింటికి తెలుగుదేశం



- కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి సంక్షేమం పై కరపత్రాల పంపిణీ

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు , టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' పేరుతో చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువు ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన ప్రజాహిత పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి తీసుకున్న చర్యలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు శ్రీమతి తమ్మిశెట్టి జానకి దేవి, మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, కారంపూడి అంకమరావు, రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివ శేషగిరిరావు, పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ వడిశ నరేష్, వార్డు ప్రధాన కార్యదర్శి బలబద్ర రమేష్, పట్టణ మహిళా ఉపాధ్యక్షురాలు సింహాద్రి బేబీ రాణి, వార్డు మహిళా అధ్యక్షురాలు నాగులపల్లి శివ పార్వతి, ఇమ్మంది రాజారావు, ఇబ్బంది అప్పారావు, నాగులపల్లి వెంకన్న, ఇమ్మంది లక్ష్మి, షేక్ జాన్ బీ, కొనగల వెంకటేశ్వరమ్మ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమానికి రత్నాల చెరువు ప్రాంత ప్రజలు విశేష స్పందన తెలిపారని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో పూర్తి విశ్వాసం నెలకొన్నదని నాయకులు పేర్కొన్నారు.

## మెగా డీఎస్సీపై దగా మాటలు ఆపండి : ఎమ్మెల్యే నసీర్

- అధికారంలోకి వచ్చిన వెంటనే నోటిఫికేషన్
- యువత కలలు సాకారం చేశాం
- నిరుద్యోగులను వంచన చేసిన ఇప్పుడు నిందలా ?
- వైసీపీపై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ మండిపాటు
- రామిరెడ్డితోటలో మన ఇంటికి-మన నసీర్
- ఘన స్వాగతం పలికిన స్థానిక ప్రజలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ద్వారా నిరుద్యోగ యువత కలలు సాకారం చేశామని, దీనిపై ఇప్పటికైనా వైసీపీ దగా మాటలు ఆపాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ హితవు పలికారు. మంగళవారం స్థానిక రామిరెడ్డినగర్ లో "మన ఇంటికి మన నసీర్"కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే నసీర్ కు స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. తొలుత మహిళలు హారతులు ఇస్తూ తమ ప్రియతమ నేతకు పట్టం కట్టారు. ఎన్నికల సమయం కానప్పటికీ తాము ప్రజల వద్దకు ధైర్యంగా వెళుతున్నామంటే తమ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ ,అభివృద్ధి కారణమని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. రామిరెడ్డి తోటలో ప్రతి గుమ్మానికి వెళ్లి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న ఫలాల గురించి చర్చించారు. మంచినీటి సరఫరా, రోడ్లు, శానిటేషన్ వంటి మౌలిక వసతులపై ఆరా తీశారు. వ్యక్తిగతంగా ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఏ విధమైన సహకారం అందిస్తే బాగుంటుందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని భరోసా కల్పించారు. వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ పేరిట నిరుద్యోగులను వంచన చేశారని విమర్శించారు. ప్రజలు ఛీకొట్టినా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదన్నారు. రెండేళ్లకాలంలో రాష్ట్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగాయని తెలిపారు. సూపర్ సిక్స్ తో చెప్పింది చెప్పినట్లు చేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి వచ్చిన చెప్పుల ఫ్యాక్టరీలను సైతం తరిమికొట్టారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో పెట్టుబడుల వరద పారించారని తెలిపారు. ఇప్పటికే గూగుల్, క్వాంటమ్ వంటి పెద్ద పెద్ద సంస్థలు ఆంధ్రప్రదేశ్ కు తరలివచ్చాయని, లక్షల కోట్ల పెట్టుబడులతో పారిశ్రామికవేత్తలు క్యూకట్టారని చెప్పారు. యువత ఉద్యోగాల వారధిగా ఆంధ్రప్రదేశ్ కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకునేందుకు మాత్రమే గొడ్డలి పార్టీ ఉందని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇప్పటికే ప్రజలకు సంతృప్తికరమైన పాలన అందించామని, ఇంకా ఏమి చేయగలమో తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకుంటున్నామని తెలిపారు.

### ఆటోనగర్ అభివృద్ధికి ముందడుగు

గుంటూరు నగరంలో పారిశ్రామిక ప్రాంతమైన ఆటోనగర్ అభివృద్ధికి ముందడుగు వేశామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు.

మంగళవారం స్థానిక ఆటోనగర్ లో రూ. 1.25 కోట్లతో జీసీబీ, సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులు వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు.

కార్మికులు అధికంగా ఉంటే ఆటోనగర్ లో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో మంచినీటి పైపు లైన్ల కనెక్షన్లకు రుసుము తగ్గించేందుకు ప్రయత్నించామని చెప్పారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం : జడ్జి లత

- ఎన్ఆర్ఐ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సులో ఐదవ అదనపు సివిల్ జడ్జి లత




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** డిజిటల్ యుగంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఐదవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) లత సూచించారు. గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సాయి కళ్యాణ్ చక్రవర్తి ఆదేశాల మేరకు మంగళవారం గుంటూరు లక్ష్మీపురంలోని ఎన్ఆర్ఐ కళాశాలలో నిర్వహించిన "న్యాయ విజ్ఞాన సదస్సు"లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు న్యాయ అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా లత మాట్లాడుతూ సోషల్ మీడియా, ఇంటర్నెట్ వంటి డిజిటల్ వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద లింకులు, నకిలీ వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

విద్యార్థులు తమ కుటుంబాలకు ఎంతో విలువైన వారని, బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తూ తమ భద్రతను కాపాడుకోవాలని అన్నారు. జీవితంలో ధైర్యంగా ముందుకు సాగుతూ సురక్షితమైన వాతావరణంలో ఉండేందుకు అవసరమైన న్యాయ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. నేరాలకు అవకాశమిచ్చే పరిస్థితులను నివారిస్తూ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

పోక్సో చట్టం--2012 గురించి వివరిస్తూ, 18 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలను లైంగిక వేధింపులు, దుర్వినియోగం నుంచి రక్షించేందుకు ఈ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కౌమారదశలో ఉన్న విద్యార్థులు అనుచిత ప్రవర్తనను గుర్తించడం, చట్టపరమైన నిబంధనలను తెలుసుకోవడం, అవసరమైతే ఫిర్యాదు చేసే విధానాలపై అవగాహన కలిగి ఉండటం అవసరమని పేర్కొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య ఉన్న తేడాను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని ఆమె సూచించారు. చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న వారు చట్టబద్ధంగా సమ్మతి ఇవ్వలేరని, మైనర్‌తో ఏ విధమైన లైంగిక చర్య అయినా శిక్షార్హమైన నేరమని స్పష్టం చేశారు.

సదస్సులో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని సైబర్ భద్రత, పోక్సో చట్టం, వ్యక్తిగత భద్రత, న్యాయ హక్కులకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన పొందారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు న్యాయమూర్తి లత సమాధానాలు ఇచ్చి సందేహాలను నివృత్తి చేశారు.

## డెంగ్యూపై అవగాహనతోనే వ్యాధి నివారణ సాధ్యం

- సహాయ మలేరియా అధికారి ప్రభాకరరెడ్డి



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందితే వ్యాధి బారిన పడకుండా నివారించవచ్చని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి తెలిపారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని సహాయ మలేరియా అధికారి కార్యాలయంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మలేరియా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డెంగ్యూ లక్షణాలు, నివారణ చర్యలపై కరపత్రాలు, సమావేశాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డెంగ్యూ వైరస్ ఏడిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుందని, ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని, జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, కంటి నొప్పులు, ఒంటిపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచన మేరకు చికిత్స పొందాలని చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, తొట్లు, గాబులు, పూల కుండీలు, టైర్లు, కొబ్బరి బొండాలు, ఫ్రిజ్‌లు, కూలర్లలో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమ గుడ్డు నుంచి 8 నుంచి 10 రోజుల్లో పెద్ద దోమగా మారుతుందని ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ సహా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టడం సాధ్యమవుతుందని, దోమతెరలు ఉపయోగించడం, పూర్తి వస్త్రధారణ చేయడం, సాయంత్రం వేళల్లో తలుపులు, కిటికీలు మూసివేయడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సమావేశంలో అధికారులు పిలుపునిచ్చారు.

## ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలి



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్):** కాకుమాను మండలం రైతులు ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి పంటలనే సాగు చేసుకోవాలని కాకుమాను మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ తెలిపారు.

ప్రస్తుత వర్షాబావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలైన మినుము, పెసర పంటలను సాగు చేసుకోవాలని వ్యవసాయ అధికారి రైతులకు తెలియపరిచారు. కాకుమాను మండలంలోని కె.బి పాలెం, కొల్లిమర్ల గ్రామాల్లోని రైతులకు మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులందరూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్కువ కాలపరిమితి గల మినుము పెసర పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు కావలసిన ఎరువులు మండలంలోని ప్రతి ఒక్క రైతు సేవా కేంద్రంలో ఉన్నాయన్నారు . మరియు ప్రధానమంత్రి పంటల భీమా పథకంలో భాగంగా వరి పంట వేసుకునే రైతులు ఎకరానికి 800 రూపాయలు/-మీ సేవ ద్వారా ఆగస్టు 15 లోపు కట్టుకోవచ్చని తెలియజేశారు. మినుము పంటకే పసల బీమా యోజన క్రింద 200/-కట్టుకోవచ్చని రైతులుకు తెలియజేశారు. ఈ అవకాశం జూలై 31వ తేదీ వరకు ఉందని తెలియజేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

## సాంకేతిక ఆధారాలతో మోటార్ దొంగల గుట్టురట్టు

- రూ.15.33 లక్షల విలువైన 85 వాటర్ మోటార్లు స్వాధీనం..
- ఏడుగురు అరెస్ట్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా పొన్నూరు రూరల్, పొన్నూరు టౌన్, చేబ్రోలు, తెనాలి రూరల్, చుండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా జరిగిన వాటర్ మోటార్ చోరీల కేసులను పొన్నూరు రూరల్ పోలీసులు ఛేదించారు. ఆరుగురు నిందితులతో పాటు దొంగసొత్తు కొనుగోలు చేసిన ఒక రిసీవర్‌ను అరెస్ట్ చేసి, రూ. 15.33 లక్షల విలువైన 85 వాటర్ మోటార్లు, రూ. 20 వేల విలువైన 18 కిలోల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

మంగళవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కేసు వివరాలను వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం, జూన్ 3 నుంచి జూలై 19 వరకు రాత్రి వేళల్లో పొలాల వద్ద రోడ్ల పక్కన అమర్చిన 91 వాటర్ మోటార్లను నిందితులు అపహరించారు. మొత్తం రూ. 15.47 లక్షల విలువైన మోటార్లు చోరీకి గురవడంతో రైతుల ఫిర్యాదుల మేరకు వివిధ పోలీస్ స్టేషన్లలో 13 కేసులు నమోదు చేసి ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నేరం జరిగిన ప్రాంతాల పరిసరాల్లోని సీసీటీవీ దృశ్యాలు, ఏఎన్‌పీఆర్ కెమెరాలు, సీసీటీవీ-360 యాప్, సీసీటీఎన్ఎస్, కాల్ డీటైల్ రికార్డులు, టవర్ లొకేషన్ విశ్లేషణ ఆధారంగా నిందితులు వినియోగించిన క్రెటా కారును గుర్తించారు. సెల్ఫ్ డ్రైవ్ రెంటల్ వాహనంగా ఉన్న ఆ కారును అద్దెకు తీసుకున్న వ్యక్తుల వివరాలను సేకరించి సాంకేతిక ఆధారాలతో నిందితుల ఆచూకీ కనుగొన్నారు. జూలై 27న బ్రాహ్మణకోడూరు గ్రామ శివారులో నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 85 వాటర్ మోటార్లు, 18 కిలోల కాపర్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. చోరీలకు వినియోగించిన క్రెటా కారు, డిజైర్ కారు, ఆటోను కూడా సీజ్ చేశారు. పోలీసుల దర్యాప్తులో నిందితులు చోరీ చేసిన మోటార్లను విక్రయించి వచ్చిన డబ్బుతో విలాసవంతమైన జీవితం గడపాలనే ఉద్దేశంతో ఈ నేరాలకు పాల్పడినట్లు వెల్లడైంది. ప్రధాన నిందితుడిపై గతంలో దొంగతనం, గొడవలు, అక్రమ మద్యం విక్రయానికి సంబంధించిన కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో పొన్నూరు రూరల్‌లో నాలుగు, పొన్నూరు టౌన్‌లో ఒకటి, చేబ్రోలులో ఒకటి, చుండూరులో ఒకటి, తెనాలి రూరల్‌లో ఆరు కేసులు సహా మొత్తం 13 కేసులు నమోదయ్యాయి. ఇప్పటివరకు చోరీకి గురైన 91 మోటార్లలో 85 మోటార్లను పోలీసులు రికవరీ చేశారు. ఈ కేసును తెనాలి ఎస్‌డీపీవో జనార్దన్ రావు పర్యవేక్షణలో పొన్నూరు రూరల్ సీఐ కృష్ణయ్య, ఎస్ఐ శ్రీహరి, పోలీసు సిబ్బంది, సీసీటీవీ సాంకేతిక విభాగం, టవర్ లొకేషన్ విభాగం సంయుక్తంగా దర్యాప్తు చేసి తక్కువ సమయంలో ఛేదించారు. కేసును విజయవంతంగా ఛేదించిన బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

## సిడిఆర్ సమీక్ష




**బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్ ):** డిఎండహెచ్ఓ డాక్టర్ ఎస్. విజయమ్మ, డిఐఓ డాక్టర్ సి. రత్న మన్మోహన్ తో పాటు, ఏరియా హాస్పిటల్ గైనకాలజిస్టులు మరియు పీడియాట్రిషియన్లు డిఎంహెచ్ఓ ఛాంబర్‌లో జరిగిన శిశు మరణ సమీక్ష (సిడిఆర్) సమావేశాన్ని సమీక్షించారు. ఈ సమీక్ష సందర్భంగా డిఎంహెచ్ఓ నివేదించబడిన అన్ని శిశు మరణ కేసులను సవివరంగా విశ్లేషించినారు. వాటి మూల కారణాలను పరిశీలించి, జిల్లాలో శిశు మరణాలను తగ్గించడానికి నివారణ చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా డి ఎం హెచ్ ఓ విజయమ్మ మాట్లాడుత్య అధిక ప్రమాదం ఉన్న పిల్లలను సకాలంలో గుర్తించడం, వెంటనే నిపుణుల వద్దకు పంపడం, నాణ్యమైన చికిత్స అందించడం మరియు సమర్థవంతంగా పర్యవేక్షించడం యొక్క ప్రాముఖ్యతను తెలిపారు. శిశు ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచడానికి మరియు నివారించదగిన శిశు మరణాలను నిరోధించడానికి, సమన్వయాన్ని బలోపేతం చేయాలని, సరైన డాక్యుమెంటేషన్‌ను నిర్ధారించాలని మరియు తగిన దిద్దుబాటు చర్యలను అమలు చేయాలని సంబంధిత అధికారులకి సూచించారు.

## డ్రోన్ల ద్వారా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో అడవుల్లో డ్రోన్ల ద్వారా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం ప్రారంభమైంది. రాష్ట్రంలో తొలిసారిగా డ్రోన్ టెక్నాలజీతో సీడ్ బాల్స్ జారవిడిచే ప్రక్రియకు అటవీశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. అడవులు క్షీణించిన ప్రాంతాల్లో పచ్చదనం పునరుద్ధరణ కోసం ఈ చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా సీడ్ బాల్స్ తయారుచేసి, వెదజల్లే కార్యక్రమం ప్రారంభించారు.

ఈ నేపథ్యంలో గుంటూరు డివిజన్ గుంటూరు రేంజి కొండవీడు రిజర్వు అటవీ ప్రాంతాల్లో విత్తన బంతులు డ్రోన్ల సాయంతో వెదజల్లే ప్రక్రియకు జిల్లా అటవీ అధికారులు శ్రీకారం చుట్టారని జిల్లా అటవీ అధికారి ఎం.హిమ శైలజ తెలిపారు. రాష్ట్రంలో డ్రోన్ టెక్నాలజీతో సీడ్ బాల్స్ వెదజల్లే ప్రక్రియ చేపట్టడం ఇదే తొలిసారి అన్నారు మనుషులు ప్రవేశించలేని దట్టమైన అడవుల్లోనూ సీడ్ బాల్స్ జారవిడిచేందుకు ఈ విధానం ఎంచుకోవడం జరిగిందని వివరించారు. గుంటూరు అటవీ రేంజ్ పరిధిలో మొత్తం 3 లక్షల సీడ్ బాల్స్ తయారు చేసి వాటిని డ్రోన్ సాంకేతికతతో జారవిడుస్తున్నట్లు చెప్పారు. గుంటూరు డివిజన్ గుంటూరు రేంజి పరిధిలో క్షీణించిన అటవీ ప్రాంతాలను గుర్తించి, పునరుద్ధరణ ప్రక్రియ చేపట్టామన్నారు. ఈ కార్యక్రంలో ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ డి. పోతురాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆగస్టు 1 నుంచి ఎఫ్ఆర్ఎస్ హాజరుతోనే పారిశుద్ధ్య కార్మికుల జీతాలు



- కమిషనర్ మయూర్ అశోక్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల హాజరు నమోదులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) ద్వారానే హాజరు నమోదు చేయాలని, ప్రతిరోజూ ఉదయం 6 గంటలలోపు హాజరు ప్రక్రియ పూర్తి చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఆగస్టు 1 నుంచి కార్మికుల హాజరును నేరుగా వేతనాలతో అనుసంధానం చేయనున్నందున, ఏ కార్మికుడికి జీతం అందకపోయినా సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మంగళవారం కెవీపీ కాలనీ, జాతీయ రహదారి సర్వీస్ రోడ్లు, ఏటుకూరు, వస్త్ర నగర్, తారకరామ నగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ విస్తృతంగా పర్యటించి ఖాళీ స్థలాలు, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైన్లు, వాకింగ్ ట్రాక్‌లు, హరితాభివృద్ధి పనులను పరిశీలించారు. నగరంలోని ఖాళీ స్థలాలను వెంటనే శుభ్రపరచి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రధాన రహదారుల వెంట పిన్ పాయింట్ ప్రోగ్రాం ప్రకారం విస్తృతంగా మొక్కలు నాటాలని ఆదేశించారు. రోడ్లపై ఆక్రమణల తొలగింపు, పార్కుల అభివృద్ధికి గుర్తించిన స్థలాల మార్కింగ్‌ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులకు సూచించారు.

ఏటుకూరు చెరువు వాకింగ్ ట్రాక్‌ను ప్రజలకు మరింత అనుకూలంగా తీర్చిదిద్దేందుకు ట్రాక్ వెంబడి మొక్కలు నాటడంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గాయత్రి నగర్‌లో తాగునీటి సమస్యపై స్థానికుల ఫిర్యాదులను పరిశీలించిన కమిషనర్, శాశ్వత పరిష్కారం లభించే వరకు ప్రతిరోజూ ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు, తాగునీటి సరఫరా, హరిత వాతావరణం, మౌలిక సదుపాయాల కల్పనలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ బి. శ్రీనివాసరావు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈ వేణుగోపాల్‌తో పాటు ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక శాఖల అధికారులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణలు నిరూపించాలి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మెగా డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు తమ ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సవాల్ విసిరారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని అన్నారు. అక్రమాలు జరిగాయని నిరూపిస్తే బహిరంగ చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు.

మెగా డీఎస్సీ ద్వారా వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించిన కూటమి ప్రభుత్వ విజయాన్ని జీర్ణించుకోలేక వైసీపీ విషప్రచారానికి దిగిందని విమర్శించారు. పరీక్షల్లో అర్హత సాధించి ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల ప్రతిభను, వారి కష్టాన్ని, కుటుంబాల ఆశయాలను కించపరిచేలా వైసీపీ వ్యవహరిస్తోందన్నారు. డీఎస్సీపై ఆరోపణలు చేస్తూ విద్యార్థుల్లో అనుమానాలు, గందరగోళం సృష్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కోర్టులను ఆశ్రయించినప్పటికీ ఎలాంటి ఆధారాలు చూపలేక కేసులను ఉపసంహరించుకున్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఉద్యోగాలు ఆగిపోవాలనే ఉద్దేశంతో దాదాపు 240 కేసులు వేయించారని, అయినప్పటికీ కూటమి ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా కేవలం 148 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి రికార్డు సృష్టించిందని గళ్ళా మాధవి పేర్కొన్నారు. జగన్ పాలనలో ఒక్క మెగా డీఎస్సీ కూడా నిర్వహించకుండా నిరుద్యోగులను జాబ్ క్యాలెండర్ పేరుతో మోసం చేశారని విమర్శించారు. వాలంటీర్, సచివాలయ నియామకాలు, గ్రూప్-1 పరీక్షలు, కారుణ్య నియామకాల వ్యవహారాల్లో వచ్చిన ఆరోపణలు వైసీపీ పాలనలోనే చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని, పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన వేలాది మంది యువత ప్రతిభను అవమానించే రాజకీయాలు మానుకోవాలని, అక్రమాలు జరిగాయని చెబితే ఆధారాలు చూపాలని, లేదంటే ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వైసీపీ నాయకులకు గళ్ళా మాధవి సవాల్ విసిరారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ కమిషనర్‌కు వినతిపత్రం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని పలు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు విద్యాభవన్‌లో విద్యాశాఖ కమిషనర్ తమీం అన్సారియాను కలిసి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి యనమల ఆంజనేయులు నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ పరీక్షకు హాజరయ్యేందుకు ఆన్‌డ్యూటీ (ఓడీ) సౌకర్యం కల్పించాలని, రాష్ట్రంలో 16 వేలకు పైగా ఉన్న సింగిల్ టీచర్లకు క్యాజువల్ లీవ్ సమయంలో డిప్యూటేషన్ సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే 2025 సాధారణ బదిలీల్లో బదిలీ అయినప్పటికీ ఇప్పటికీ రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఉపాధ్యాయ పోస్టుల కేటాయింపునకు రూపొందిస్తున్న సీనియారిటీ జాబితాల్లో ప్రమోషన్ రివర్షన్ తీసుకున్న ఉపాధ్యాయుల సేవలను, ఎయిడెడ్ విద్యాసంస్థల నుంచి మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో విలీనమైన ఉపాధ్యాయుల సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అంతర్‌జిల్లా బదిలీలపై వచ్చిన ఉపాధ్యాయుల సీనియారిటీ అంశాన్ని కూడా న్యాయంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పరిధిలోని మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ప్రత్యేక యూడైస్ కోడ్ మంజూరు చేయడంతో పాటు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల విధులు, బాధ్యతలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని సంఘం ప్రతినిధులు కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఫారిన్ సర్వీస్‌పై నియమితులై మూడేళ్లు పూర్తయినా రెన్యువల్ లేకుండానే కొనసాగుతున్న ఉపాధ్యాయుల వ్యవహారంపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

## వీవీఐటీయూలో కంప్యూటేషనల్ క్లినికల్ న్యూరోసైన్స్‌పై జాతీయ సదస్సు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** విద్యార్థుల మానసిక వికాసం, అభ్యాస సామర్థ్యాల పెంపునకు న్యూరోసైన్స్, కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతలను అనుసంధానించే లక్ష్యంతో వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ (వీవీఐటీయూ)లో "కంప్యూటేషనల్ క్లినికల్ న్యూరోసైన్స్" అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సూచనల మేరకు సీఎస్ఎం, సీఎస్ఈ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు ఐఐటీ మద్రాస్ బయోటెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ వి. శ్రీనివాస చక్రవర్తి ముఖ్య వక్తగా హాజరయ్యారు. రాష్ట్రంలోని ఇంజినీరింగ్, మెడికల్, ఫార్మసీ, బయోటెక్నాలజీ, డిగ్రీ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సదస్సులో ప్రొఫెసర్ శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మెదడు స్పందించే తీరు భిన్నంగా ఉంటుందని, కొందరు దృశ్యాల ద్వారా, మరికొందరు వినడం ద్వారా త్వరగా నేర్చుకుంటారని తెలిపారు. న్యూరోసైన్స్ ఆధారిత బోధనా విధానాలతో విద్యార్థుల వ్యక్తిగత అభ్యాస సామర్థ్యానికి అనుగుణంగా బోధన అందించవచ్చని వివరించారు. కృత్రిమ మేధ, డేటా సైన్స్ సాయంతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు సాధ్యమవుతున్నాయని, అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి సంక్లిష్ట నాడీ సంబంధిత వ్యాధులను ముందస్తుగా గుర్తించడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తోందని విద్యార్థులకు వివరించారు.

విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయని వీవీఐటీయూ ప్రో-ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. అనంతరం వీవీఐటీయూ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు ప్రొఫెసర్ శ్రీనివాస చక్రవర్తిని సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జున రెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వి. రామచంద్రన్, సీఎస్ఎం విభాగాధిపతి డాక్టర్ జి. సంజయ్ గాంధీ, ఈసీఈ విభాగాధిపతి ఇన్నావుల్ హక్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దైనందిన జీవితంలో యోగా, ధ్యానం భాగం కావాలి : మంత్రి దుర్గేష్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట సమీపంలోని రాజవరం శ్రీ వశిష్ట గౌతమి పిరమిడ్ ధ్యాన మహాక్షేత్రంలో నిర్వహించిన గురుపౌర్ణమి మహోత్సవాల్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. నేటి ఒత్తిడితో కూడిన జీవితంలో మానసిక ప్రశాంతత, ఆరోగ్యకరమైన జీవనానికి యోగా, ధ్యానం దైనందిన జీవితంలో భాగం కావాలని ఆయన పిలుపునిచ్చారు. చిన్నతనం నుంచే ధ్యానాన్ని అలవాటు చేసుకుంటే వ్యక్తిత్వ వికాసంతో పాటు అన్ని రంగాల్లో రాణించే నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు.

రాజవరం పిరమిడ్ ధ్యాన కేంద్రం అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగిన ప్రదేశమని మంత్రి తెలిపారు. గోదావరి తీర ప్రాంతాన్ని అనుసంధానిస్తూ వాటర్ స్పోర్ట్స్, రాజవరం పిరమిడ్, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయం, కోనసీమ ప్రకృతి అందాలను కలుపుతూ సమగ్ర "కోనసీమ టూరిజం సర్క్యూట్" అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సమగ్ర డీపీఆర్ సిద్ధం చేసి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ దృష్టికి తీసుకెళ్లి కేంద్ర నిధులు సాధించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ధ్యానం ద్వారా శాంతియుత, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. పర్యాటకాభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న నిర్వాహకులను అభినందిస్తూ, కోనసీమలో పర్యాటక రంగాన్ని మరింత విస్తరించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## '2 ఏళ్ల నమ్మకం' ప్రచారానికి ప్రజల ఆదరణ

- అమృతలూరుకు రూ.9.66 కోట్ల సంక్షేమం..
- అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు



**అమృతలూరు (జర్నలిస్ట్ ఫైల్):** "2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమం రెండో రోజు అమృతలూరు గ్రామంలో ఉత్సాహంగా కొనసాగింది. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలు, సూచనలను తెలుసుకుని వాటిని మైటీడీపీ యాప్‌లో నమోదు చేశారు. ప్రతి కుటుంబాన్నికలిసి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, సీయూబీ ఇన్‌చార్జ్‌లు, పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

అమృతలూరు గ్రామంలోని 2,474 కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా మొత్తం రూ. 9.66 కోట్ల మేర ప్రయోజనం అందిందని ఎమ్మెల్యే తెలిపారు. తల్లికి వందనం, దీపం--2, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, గృహ నిర్మాణం, డ్వాక్రా తోడు, పీఎం కిసాన్, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు వంటి పథకాల ద్వారా వేలాది మంది లబ్ధి పొందినట్లు వివరించారు. గ్రామంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, 67 గృహాల నిర్మాణం పూర్తి కాగా, సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, వీధి దీపాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రం, కమ్యూనిటీ హాళ్లు, బస్ షెల్టర్లు వంటి మౌలిక వసతులు అందు బాటులో ఉన్నాయని తెలిపారు.

ప్రజల సంక్షేమం, గ్రామాల సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నక్కా ఆనంద్ బాబు పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, మహిళా శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం--2, అన్న క్యాంటీన్లు, కౌలు రైతులు, పాల ఉత్పత్తిదారులు, మత్స్యకారులు, గొర్రెలు--మేకల పెంపకందారులకు అమలు చేస్తున్న పథకాలు గ్రామీణ ప్రజలకు భరోసా కల్పిస్తున్నాయని చెప్పారు.

స్వర్ణాంధ్ర-విజన్ 2047 లక్ష్యంగా పరిశ్రమలు, ఉపాధి, పోలవరం, అమరావతి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, సీయూబీ ఇన్‌చార్జ్‌లు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నటి జ్యోతిక వ్యాఖ్యల వివాదం : బీజేపీ ఎస్సీ మోర్చా ఫైర్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** నటి జ్యోతిక ఇటీవల చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ తీవ్రంగా స్పందించారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సామాజిక సమరసత, సామాజిక స్పృహతో పిల్లలను పెంచుతానని జ్యోతిక చెప్పడం స్వాగతించదగ్గ విషయమేనని, అయితే అలాంటి విలువలు కేవలం మాటల్లో కాకుండా ఆచరణలోనూ ప్రతిబింబించాలని అన్నారు. సమాజానికి ఆదర్శంగా నిలిచే స్థాయిలో ఉన్న సినీ ప్రముఖులు తమ వ్యాఖ్యల్లో బాధ్యత పాటించాలని సూచించారు.

ఇటీవల జంతర్ మంతర్‌లో జరిగిన ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ అభిజిత్ దీప్కే వంటి వ్యక్తులను ఆదర్శంగా పేర్కొన్న జ్యోతిక, నిజంగా సామాజిక సమరసతకు కట్టుబడి ఉంటే తన కుమార్తెలకు అభిజిత్ దీప్కే వంటి వ్యక్తులతో వివాహం జరిపించాలని పనతల సురేష్ వ్యాఖ్యానించారు. అలా చేసినప్పుడే ఆమె చెప్పే సమానత్వ భావనకు నిజమైన అర్థం వస్తుందని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం గురించి మాట్లాడే వారు ముందుగా వాటిని తమ జీవితంలో అమలు చేసి చూపించాలని అన్నారు.

సినీ ప్రముఖులు ప్రజలను ప్రభావితం చేసే స్థాయిలో ఉంటారని, అందువల్ల ఏ అంశంపై స్పందించినా పూర్తి అవగాహనతో వ్యవహరించాలని పనతల సురేష్ సూచించారు. సామాజిక ప్రయోజనాలకు ఉపయోగపడే అంశాలపై మాత్రమే తమ అభిప్రాయాలను వెల్లడించాలని, వివాదాస్పద ఉద్యమాలకు మద్దతు ప్రకటించే ముందు అన్ని కోణాలను పరిశీలించాలని అన్నారు. సంఘ విద్రోహ శక్తులు చొరబడ్డాయని ఆరోపణలు ఉన్న ఉద్యమాలను సమర్థించడం సరైన విధానం కాదని విమర్శించారు.

సమాజంలో పారదర్శకత, బాధ్యత, సామాజిక సమరసత పెంపొందించే దిశగా ప్రముఖులు వ్యవహరించాలని పనతల సురేష్ పిలుపునిచ్చారు. సామాజిక ఐక్యతను బలోపేతం చేసే సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖులు, సామాజిక నాయకులందరిపై ఉందన్నారు.

విలేకరుల సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లారి గంగాధర్, జోనల్ ఇన్‌చార్జి మేకల లక్ష్మణ్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సర్వశుద్ధి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో నుంచి రైతులను ఆదుకోండి



- సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందించిన సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఎల్ నినో కారణంగా తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. కె. రామకృష్ణ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిశారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 54 శాతం తక్కువగా వర్షపాతం నమోదైందని, 249 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని ఆయన వివరించారు. అదే విధంగా మంచినీటి ఎద్దడి లేకుండా ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని రామకృష్ణ ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ... ప్రభుత్వం ఇప్పటికే ఎల్ నినో సమస్యపై దృష్టి సారించిందని, ఆగస్ట్ 3 నుంచి అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య రాకుండా ఉండేలా యంత్రాగానికి ఆదేశాలు జారీ చేశామని సీఎం అన్నారు. ప్రభుత్వం దృష్టికి రామకృష్ణ తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు.

## గురు పౌర్ణమి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సంత్ రవిదాస్ జయంతి వేడుకలు: బీజేపీ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గురు పౌర్ణమి సందర్భంగా ఈ నెల 29న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో సంత్ రవిదాస్ 650వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ తెలిపారు. గుంటూరు అరండల్‌పేటలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ పిలుపు మేరకు, రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో దేవాలయాల సమీపంలో సంత్ రవిదాస్ చిత్రపటాలను ఏర్పాటు చేసి దీపాలు వెలిగించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాలు దశలవారీగా వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగుతాయని తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ, అణగారిన వర్గాల్లో జన్మించిన సంత్ రవిదాస్ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. కులవివక్ష, అంటరానితన నిర్మూలనే ఆయన జీవిత లక్ష్యమని చెప్పారు. గురు పౌర్ణమి సందర్భంగా వారణాసిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గుంటూరు జిల్లాలో సంత్ రవిదాస్ ప్రచార రథాన్ని అన్ని మండలాల్లో తిప్పి ఆయన సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని బీజేపీ నాయకులు వెల్లడించారు. 650వ జయంతి వేడుకల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దారా అంబేద్కర్, రాష్ట్ర సీనియర్ నాయకుడు పాలపాటి రవి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంతేటి బ్రహ్మయ్య, రాష్ట్ర మీడియా ప్యానలిస్టు తాడువాయి రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జంతువుల నుంచి సోకే వ్యాధుల కట్టడికి రాష్ట్ర కార్యాచరణ కోసం కసరత్తు

- ప్రాధాన్య వ్యాధుల గుర్తింపుపై అన్ని శాఖల ఉమ్మడి చర్చ
- నిఘా, పరీక్షలు, అత్యవసర స్పందన బలోపేతంపై సిఫారసులు
- విజయవాడలో మూడు రోజుల 'వన్ హెల్త్' కార్యశాల ప్రారంభం




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను ముందుగానే గుర్తించి, వాటి వ్యాప్తిని అడ్డుకునేందుకు సమగ్ర రాష్ట్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజారోగ్యానికి ఎక్కువ ముప్పు కలిగించే జూనోటిక్ వ్యాధులను గుర్తించి, వాటి నివారణ, నిఘా, పరీక్షలు, నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను ఈ ప్రణాళికలో చేర్చనున్నారు.

ఈ ప్రణాళిక రూపకల్పనలో భాగంగా రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం మూడు రోజుల 'వన్ హెల్త్ జూనోటిక్ వ్యాధుల ప్రాధాన్యత నిర్ధారణ--రాష్ట్ర కార్యాచరణ ప్రణాళిక అభివృద్ధి' కార్యశాల ప్రారంభమైంది. జూలై 30 వరకు జరిగే ఈ కార్యశాలను కేంద్ర ఆరోగ్య శాఖకు చెందిన జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం సహకారంతో నిర్వహిస్తున్నారు. అమెరికా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రం సాంకేతిక సహకారం అందిస్తుండగా, జాన్స్ ఆప్కిన్స్ ప్రోగ్రాం ఫర్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఇన్ గైనకాలజీ అబ్‌స్ట్రిక్స్(జెహెచ్ పిఐఇజిఓ) కార్యశాల నిర్వహణకు తోడ్పడుతోంది.

ఆరోగ్య, పశుసంవర్ధక, అటవీ, పర్యావరణ, వ్యవసాయ, మత్స్య శాఖల అధికారులు, వైద్య--పశువైద్య నిపుణులు, విద్యాసంస్థలు, భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు కలిసి రాష్ట్రంలో ముందుగా నియంత్రించాల్సిన వ్యాధులపై చర్చించారు. ఒక్కో వ్యాధి తీవ్రత, వ్యాప్తి అవకాశం, ప్రజలకు కలిగే ముప్పు, అందుబాటులో ఉన్న నివారణ సదుపాయాలను పరిశీలించి ప్రాధాన్య క్రమం నిర్ణయించనున్నారు. బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్, పరాన్నజీవుల ద్వారా వ్యాపించే 45 రకాల వ్యాధులను ప్రాథమిక జాబితాలో పరిశీలించారు. స్క్రబ్ టైఫస్, మెలియోయిడోసిస్, ఆంత్రాక్స్, హిస్టోప్లాస్మోసిస్, డెంగీ, జికా, ఎల్లో ఫీవర్, కొవిడ్-19, రేబిస్ తదితర వ్యాధులపై నిపుణులు అభిప్రాయాలు వెల్లడించారు.

మనుషులు, జంతువుల్లో వ్యాధులను ముందే గుర్తించేందుకు నిఘా వ్యవస్థను బలోపేతం చేయడం, పరీక్షా కేంద్రాల సామర్థ్యాన్ని పెంచడం, వ్యాధి బయటపడిన వెంటనే అన్ని శాఖలు కలిసి స్పందించడం, సమాచారాన్ని వేగంగా పంచుకోవడం, అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేయడంపై సూచనలు చేశారు. వైద్యులు, పశువైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, గ్రామస్థాయిలో అవగాహన, ప్రజల భాగస్వామ్యం పెంచడంపైనా చర్చించారు.

పశుసంవర్ధక శాఖ సంచాలకుడు డాక్టర్ దామోదర్ నాయుడు, డాక్టర్ సుకర్మ ఎస్.ఎస్. తన్వర్, ఎన్ సిడిసీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జితేష్ కువటాడ, ఫబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ రవీందర్ పాల్ సింగ్ , విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ మెడికల్ కాలేజ్ మైక్రోబయాలజీ హెచ్వోడీ డాక్టర్ ప్రశాంతి, వెటర్నరీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆనంద్, ఇతర మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు కార్యశాలకు హాజరయ్యారు. వ్యాధి నియంత్రణ కార్యక్రమం అదనపు సంచాలకురాలు డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి మాట్లాడుతూ జూనోటిక్ వ్యాధుల నివారణకు శాఖల సమన్వయం అత్యవసరమన్నారు. మూడు రోజుల చర్చల అనంతరం ప్రాధాన్య జూనోటిక్ వ్యాధుల జాబితాను ఖరారు చేసి, నివారణ, నిఘా, పరీక్షలు, అత్యవసర స్పందన, శిక్షణ, ప్రజలకు సమాచారం, శాఖల సమన్వయంపై సిఫారసులు రూపొందిస్తారు. వాటి ఆధారంగా రాష్ట్ర 'వన్ హెల్త్' కార్యాచరణ ప్రణాళిక సిద్ధం కానుంది.

## ప్రజా సేవతో బీజేపీని మరింత బలోపేతం చేద్దాం : బీజేపీ మాధవ్

- పోలవరం బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బుల్లి కొండ దొర ప్రమాణస్వీకారంలో మాధవ్ పిలుపు





**పోలవరం(జర్నలిస్ట్ ఫైల్):** పోలవరం నూతన బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బుల్లి కొండ దొర మంగళవారం ఘనంగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

ప్రమాణస్వీకారానికి ముందు పార్టీ శ్రేణులు పోలవరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. బీజేపీ జెండాలు, నినాదాలతో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని పార్టీ ఐక్యతను చాటిచెప్పారు. ర్యాలీ అనంతరం జరిగిన సభలో బుల్లి కొండ దొర జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.

నూతన జిల్లా అధ్యక్షుడు బుల్లి కొండ దొర మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేసి, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల నాయకులు, మహిళా మోర్చా, యువ మోర్చా ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు నాయకులు, కార్యకర్తలకు పార్టీ నాయకత్వం అభినందనలు తెలిపింది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467